ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

బుధవారం 12 నవంబరు 2025



'సెలబ్రేషన్స్'లో నిల్వ ఆహారం

- ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారుల తనిఖీల్లో నిర్ధారణ
- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు
- ఫిర్యాదు మేరకు అధికారుల చర్యలు



... వార్త 6వ పేజీలో

ఇటు పారిశ్రామికాభివృద్ధి, అటు యువతకు ఉపాధి

అదే ఎంఎస్ఎంఈల లక్ష్యం

- నియోజకవర్గానికొకటి చొప్పున ఏర్పాటు చేస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోల శ్రీబాలవీరాంజనేయస్వామి
- చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు వల్ల స్వస్థలాల్లోనే యువతకు అవకాశాలు
- కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్
- రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం: ఎంపీ ఎం.శ్రీభరత్



పెదగంట్యాడ పారిశ్రామికవాడలో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రులు డోల శ్రీబాల వీరాంజనేయస్వామి, వాసంశెట్టి సుభాష్. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, తదితరులు ఉన్నారు

పెదగంట్యాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనలకుగాను ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ) పార్కు ఉండాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోల శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. సుమారు రూ.700 కోట్ల వ్యయంతో జిల్లాలో నియోజకవర్గానికొకటి చొప్పున ఏడు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది. అందులో రెండు పూర్తయ్యాయి. వాటిని మంత్రి మంగళవారం ప్రారంభించారు. మరో ఐదు పార్కుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెదగంట్యాడ పారిశ్రామికవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ 70 శాతం కేంద్ర వాటా, 30 శాతం రాష్ట్ర వాటాతో ... మిగతా 6వ పేజీలో

జిల్లాలో 5 ఎంఎస్ఎంఈ పార్కులు

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటుచేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం జిల్లాలో మంగళవారం ఒక్కరోజే ఐదు పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్‌గా వీటికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పార్కుల నిర్మాణానికి అయ్యే వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు సమకూరుస్తాయి.

1. గాజువాక నియోజకవర్గ పరిధిలోని పెదగంట్యాడలో 1.22 ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతారు. దీని అంచనా వ్యయం రూ.8.14 కోట్లు. మొత్తం 28,000 చ.అ. విస్తీర్ణంలో షెడ్లు, షాపులు నిర్మిస్తారు.

2. విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ముడసర్లోవలో 2.18 ఎకరాల్లో రూ.14.85 కోట్లతో ఒక పారిశ్రామిక పార్కు నిర్మిస్తారు. ఇది ... మిగతా 6వ పేజీలో

భాగస్వామ్య సదస్సుకు చకచకా ఏర్పాట్లు

నేటి రాత్రికి ప్రధాన వేదిక సిద్ధం

- ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో కట్టుదిట్టంగా భద్రత
- నేటి రాత్రి నగరానికి సీఎం రాక



వీఐపీల సమావేశాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాబిన్లు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. మొత్తం ఎనిమిది హాళ్లలో ప్రధాన వేదిక, ముఖాముఖి సమావేశాలకు వీలుగా ఛాంబర్లు, డైనింగ్‌హాలు, ప్రముఖులకు క్యాబిన్లు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన వేదిక బుధవారం రాత్రికి రెడీ అవుతుంది. ఇంకా స్టాళ్ల ఏర్పాటుకు వీలుగా క్యాబిన్లు నిర్మించారు. ఢిల్లీలో బాంబుపేలుళ్ల నేపథ్యంలో సదస్సు ప్రాంగణంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. బుధవారం నుంచి ప్రాంగణం మొత్తం పోలీసుల ఆధీనంలోకి వెళ్లనున్నది. కాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి నగరానికి రానున్నారు. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం సీఎంకు పోర్టు అతిథి గృహంలో బస ఏర్పాటుచేస్తున్నారు. ఐటీ మంత్రి నారా లోకేశ్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బస చేస్తారు.

సీ వ్యూ హోటళ్లకు అతిథులు మొగ్గు

భాగస్వామ్య సదస్సుకు హాజరుకానున్న విదేశీ అతిథులతోపాటు దేశీయ ప్రతినిధులు ఎక్కువగా సముద్రానికి ఆనుకుని ఉన్న హోటళ్లలోనే బస ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రధానంగా రెండు ప్రముఖ హోటళ్లలోనే గదులు కేటాయించాలని పట్టుబడుతున్నారు. అతిథులకు లైజనింగ్ చేసే ప్రభుత్వ అధికారులు, సీఐఐ ప్రతినిధులకు ఫోన్లు చేసి సీవ్యూ ఉన్న హోటళ్లలో గదులు కావాలని అడుగుతున్నారు. ఈ సదస్సుకు వచ్చే అతిథుల కోసం అధికారులు నగరంలోని పలు హోటళ్లలో సుమారు 1,300 గదులు రిజర్వు చేశారు. వారి హోదాను బట్టి ... మిగతా 6వ పేజీలో

నిఘా నీడలో విశాఖ

- హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు
- పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

ఈ నెల 14, 15 తేదీల్లో పార్టనర్‌షిప్ సమ్మిట్ జరుగుతున్నందున్న విశాఖ నగరంలో అణువణువునా గస్తీ ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. మంగళవారం రాత్రి నక్కపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఉమ్మడి ... మిగతా 6వ పేజీలో

కైలాసగిరికి కొత్త రోప్‌వే

పాత రోప్‌వే స్థానంలో ఏర్పాటు

- తెలుగు మ్యూజియం వరకూ నిర్మాణం
- గతంలో ఒకసారి టెండర్లు
- ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో మరోసారి పిలవాలని వీఎంఆర్‌డీఏ నిర్ణయం



కైలాసగిరి రోప్‌వే (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కైలాసగిరి రోప్‌వేకు మార్పులు చేయాలని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అప్పుఘర్ సమీపానున్న రోప్‌వేను 2004 మే 5న ప్రారంభించారు. దాని పొడవు 375 మీటర్లు. 360 డిగ్రీల కోణంలో నగర అందాలను చూస్తూ కైలాసగిరిపైకి వెళ్లేలా దీనిని రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేశారు. అప్పట్లో దీనిని బీఓటీ విధానంలో అప్పగించారు. కాలం 20 ఏళ్లు. అది పూర్తి కావడంతో రోప్‌వే ఆపేసి కొత్తది నిర్మించాలని ఇటీవల అధికారులు టెండర్లు పిలిచారు. ఈసారి ఒక్క రోప్‌వేనే కాకుండా దాంతో లూజ్ గ్రావిటీ రైడ్‌ను కూడా జోడించి టెండర్లు పిలిచారు. అప్పుఘర్ నుంచి కాకుండా ... మిగతా 6వ పేజీలో

సీతమ్మధార సబ్ ట్రెజరీ విభజనకు మోకాలడ్డు

విభజించి విశాలాక్షి నగర్, గాజువాకల్లో కొత్తగా కార్యాలయాలు ఏర్పాటు చేయాలని 2018లో ప్రభుత్వం ఆదేశాలు

- అప్పటినుంచి అమలుపై దోబూచులాట
- తమకు వచ్చే మామూళ్లు తగ్గిపోతాయని కొంతమంది అధికారులు, ఉద్యోగులే అడ్డుకుంటున్నట్టు ఆరోపణలు
- కుంభకోణం వెలుగుచూసినా మారని సిబ్బంది తీరు
- ఎరియర్స్ మంజూరుకు భారీగా సొమ్ములు వసూలు



సీతమ్మధార సబ్ ట్రెజరీ ఆఫీస్

విశాఖపట్నం/సీతంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

సీతమ్మధార డివిజనల్ సబ్ ట్రెజరీని విభజించాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలుకాకుండా కొంతమంది అధికారులు, ఉద్యోగులు అడ్డుపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు 20 వేల మంది పింఛన్‌దారులు ఉన్న సీతమ్మధార కార్యాలయాన్ని విభజన చేస్తే ప్రతి నెలా వచ్చే మామూళ్లు తగ్గిపోతాయనే కారణంగానే 2018 నుంచి ఇప్పటివరకూ ఉద్యోగులు/సంఘాలు సహకరించడం లేదని విమర్శలు ఉన్నాయి.

సబ్ ట్రెజరీలో 2011 నుంచి 2017 మధ్య రూ.కోట్ల కుంభకోణం జరిగింది. ఈ నేపథ్యంలో సీతమ్మధార డివిజనల్ సబ్‌ట్రెజరీని విభజించి విశాలాక్షి నగర్, గాజువాకల్లో కొత్తగా సబ్‌ట్రెజరీలు ఏర్పాటుచేయాలని 2018లో ప్రభుత్వం జీవో ఇచ్చింది. దీనికి అనుగుణంగా విశాలాక్షి నగర్‌లో ప్రైవేటు భవనం అద్దెకు తీసుకుని అన్నిరకాల వసతులు సమకూర్చారు. అయితే కార్యాలయాన్ని విభజిస్తే మామూళ్లు తగ్గిపోతాయనే ఉద్దేశంతో అప్పట్లో కొందరు అధికారులు, ఖజానా ఉద్యోగుల సంఘంలో కొందరు నేతలు కొత్త కార్యాలయాలు ప్రారంభం కాకుండా అడ్డుకున్నారు. ఆ తరువాత కొత్త కార్యాలయాలు ఊసేలేదు. గతంలో వెలుగుచూసిన కుంభకోణంలో దోషులపై ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో డివిజనల్ సబ్‌ట్రెజరీ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. పింఛన్‌దారులకు సంబంధించి ఎరియర్స్ (బకాయిలు) మంజూరుకు కొందరు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. పింఛన్‌దారులకు చెందిన పింఛన్ పేమెంట్స్ ఆర్డర్ల (పీపీవో)ను కొందరు ఉద్యోగులు తమ వద్దే ఉంచుకుని బేరసారాలు ... మిగతా 6వ పేజీలో


వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా తేజ్ భరత్



తేజ్ భరత్

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఎన్.తేజ్ భరత్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ప్రస్తుతం మెప్మా డైరెక్టర్‌గా విజయవాడలో పనిచేస్తున్నారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న విశ్వనాథన్‌ను గత నెల తొమ్మిదో తేదీన ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి తరచూ వెళుతున్నా పెట్టుబడుల సదస్సు కారణంగా వీఎంఆర్‌డీఏపై పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారు. ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించే బాధ్యతను ప్రభుత్వం వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. విశ్వనాథన్ వెళ్లిన తరువాత ఆ పనుల్లో పెద్దగా పురోగతి లేకుండా పోయింది. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లడంతో పూర్తిస్థాయి అధికారిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో పెట్టుబడుల సదస్సు జరగనున్న ఉన్న నేపథ్యంలో తేజ్ భరత్ వెంటనే విధుల్లో చేరే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం వచ్చేసరికి ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకుంటారని సమాచారం.



ఆకట్టుకుంటున్న ఐలవ్ వైజాగ్

పెట్టుబడిదారుల సదస్సుకు నగర సుందరీకరణలో భాగంగా తాటిచెట్లపాలెం - రైల్వేస్టేషన్ మార్గంలోని న్యూకాలనీ కూడలిలో ఏర్పాటుచేసిన ఐలవ్ వైజాగ్ నేమ్‌బోర్డు సందర్శకులను ఆకట్టుకుంటోంది. గత కొద్దిరోజులుగా ఇక్కడ జరుగుతున్న పనులు మంగళవారం పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగులీనుతున్న ఐలవ్ వైజాగ్ బోర్డు చూపరులను కట్టిపడేస్తోంది.

ఉక్కులో బ్లాస్ట్‌ఫర్నేస్ జీఎం సస్పెన్షన్!

- వేరొకరికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు
- యాజమాన్య వైఖరిని తప్పుబట్టిన సీఐటీయూ

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం పర్యవేక్షణ బాధ్యతలను మెకానికల్ విభాగానికి చెందిన జనరల్ మేనేజర్ పీఎస్ వెంకటేశ్వర్లుకు అదనంగా అప్పగిస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ఓ ప్రకటన విడుదల చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్ విభాగానికి జీఎంగా ఉద్దం నాగ్ పనిచేస్తున్నారని, ఆయన 30 ఏళ్లుగా ఆ విభాగంలో పనిచేస్తూ అనేక ప్రశంసలు అందుకున్నారన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ... మిగతా 6వ పేజీలో

నేడు డాక్‌యార్డ్ వంతెన ప్రారంభం

అందుబాటులోకి సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జి

- రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన పోర్టు అధికారులు



సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన

మల్కాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

పారిశ్రామిక ప్రాంతవాసుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. వంతెన నిర్మాణం నిమిత్తం సుమారు 15 నెలల పాటు మూసివేసిన మార్గం తెరచుకోనుంది. బుధవారం ఉదయం నుంచి వంతెనపై రాకపోకలకు పోర్టు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. భారీ వాహనాలు మినహా, మిగిలిన అన్నిరకాల వాహనాలను అనుమతించనున్నారు.

పునర్నిర్మాణం నిమిత్తం 2024 ఆగస్టు 1 నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను మూసివేశారు. తొమ్మిది నెలల్లో వంతెన నిర్మాణం పూర్తిచేయాల్సి ఉండగా, వివిధ కారణాలతో ఆలస్యమయింది. రూ.30 కోట్ల వ్యయంతో గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మిషనరీ ప్రాజెక్ట్స్ సంస్థ దీనిని నిర్మించింది. ఈ నెల 10, 11 తేదీలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నిపుణులు వంతెనపై లోడింగ్ పరీక్షలు చేసి, ప్రారంభానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో పోర్టు అధికారులు బుధవారం వంతెన ప్రారంభిస్తామని అధికారికంగా ప్రకటించారు. వంతెన పొడవు 330 మీటర్లు, వెడల్పు 10.5 మీటర్లు. దిగువన సముద్రం ఉన్నందున ఉప్పుగాలులకు వంతెన ... మిగతా 6వ పేజీలో

'సెలబ్రేషన్స్'లో నిల్వ ఆహారం

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటళ్లలో నిల్వ ఆహార పదార్థాల విక్రయం యథేచ్ఛగా కొనసాగుతోంది. తాజాగా ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు దీనిపై అధికారులకు ఫిర్యాదుచేశారు. అక్కయ్యపాలెం ప్రాంతంలో ఉన్న 'సెలబ్రేషన్స్' హోటల్‌లో నిల్వ ఆహారాన్ని విక్రయిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ ఇన్‌స్పెక్టర్ అప్పారావు మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టి, సుమారు 12.3 కిలోల నిల్వ ఆహార పదార్థాలను గుర్తించారు. ఇందులో చికెన్, ఫిష్, ఫ్రైడ్ రైస్, పప్పు ఉన్నాయి. నిల్వ ఉంచిన ఆహారాన్ని వేడి చేసి విక్రయిస్తున్నట్టు నిర్ధారించిన అధికారులు హోటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ఆహార నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. దీనిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మిగిలిపోయిన ఆహార పదార్థాలను రెండేసి రోజుల పాటు ఫ్రిజ్‌లో ఉంచి వేడి చేసి కస్టమర్లకు వడ్డిస్తున్నట్టు గుర్తించామన్నారు.

పరిశుభ్రతను పరిశీలించాలి: ఎమ్మెల్యే

ప్రజలు బయట ఆహారం తినేటప్పుడు పరిశుభ్రత, ఆహార తయారీకి ఉపయోగించే పదార్థాల నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సూచించారు. ఆహార భద్రత, ప్రమాణాలశాఖ తనిఖీల నేపథ్యంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హోటళ్ల యజమానులు, చిరు వ్యాపారులు పరిశుభ్రత, నాణ్యతను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు.

ఇటు పారిశ్రామికాభివృద్ధి, అటు యువతకు ఉపాధి

... 5వ పేజీ తరువాయి

ఈ పార్కులు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరగనున్నాయన్నారు. గత ప్రభుత్వంపై నమ్మకం లేక పారిశ్రామికవేత్తలు ఎవరూ పెట్టుబడులు పెట్టలేదని, దాంతో యువతకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయన్నారు. చంద్రబాబునాయుడు నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుతీరిన తరువాత పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు వల్ల స్వస్థలాల్లోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని, అందుకే ఇక్కడ పరిశ్రమలు పెట్టేందుకు అంతర్జాతీయస్థాయి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎంఎస్‌ఎంఈ చైర్మన్ శివశంకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పెదగంట్యాడ తహశీల్దార్ అమల, పలువురు పారిశ్రామికవేత్తలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా కనిగిరిలో నిర్వహించిన పరిశ్రమల ప్రోత్సాహక సమావేశాన్ని వర్చువల్‌గా తిలకించారు.

జిల్లాలో 5 ఎంఎస్‌ఎంఈ పార్కులు

... 5వ పేజీ తరువాయి

27,600 చ.అ. విస్తీర్ణంలో వస్తుంది. అందులో 31 షెడ్లు/షాపులు వస్తాయి.

3. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వెంకటాపురంలో 2.45 ఎకరాల విస్తీర్ణంలో రూ.15.2 కోట్లతో ఒక పారిశ్రామిక పార్కు వస్తుంది. అందులో 23,800 చ.అ. విస్తీర్ణంలో 23 షెడ్లు/షాపులు నిర్మిస్తారు.

4. పెందుర్తి నియోజకవర్గం గుర్రంపాలెంలో 63.37 ఎకరాల్లో ప్రైవేటు పారిశ్రామిక పార్కును జె.కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ నిర్మిస్తుంది. అంచనా వ్యయం రూ.237.71 కోట్లు. ఇందులో ఐదు వేల మందికి ఉపాధి లభిస్తుంది. అదే గుర్రంపాలెంలో 16.47 ఎకరాల్లో అవంతి గ్రూపు వేర్‌హౌసింగ్ నిర్మిస్తుంది. దీని అంచనా వ్యయం రూ.114.37 కోట్లు. దీని ద్వారా 1,200 మందికి ఉపాధి లభిస్తుంది.

భాగస్వామ్య సదస్సుకు చకచకా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

గదులు కేటాయించాలని నిర్ణయించారు. అయితే సదస్సుకు వచ్చే ప్రముఖుల ఎంతమంది అనే లెక్కలు మారుతున్నాయి. దాంతో వారికి వసతి, రవాణా సదుపాయాల కల్పనలో అంచనాకు రాలేకపోతున్నారు. రోజురోజుకూ అతిథుల సంఖ్య పెరుగుతుండడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

నిఘా నీడలో విశాఖ

... 5వ పేజీ తరువాయి

విశాఖ జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. విశాఖ నగరమంతా డ్రోన్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమ్మిట్‌కు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు సహా జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరవుతారని, అందుచేత నగరమంతా కట్టుదిట్టమైన భద్రత చేపట్టాలన్నారు. ఫైర్ సేఫ్టీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా వుంచాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని, ఉన్నతాధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు.

కైలాసగిరికి కొత్త రోప్‌వే

... 5వ పేజీ తరువాయి

తెన్నేటి పార్కు నుంచి కొండపైకి రోప్‌వే ద్వారా తీసుకువెళ్లి, అక్కడి నుంచి మళ్లీ తెలుగు మ్యూజియం వరకూ మరో రోప్‌వే వేయాలని డిజైన్ చేశారు. ఇలా మొత్తం రోప్‌వే పొడవు 1.5 కి.మీ వస్తుందని అంచనా వేశారు. ఆ తరువాత కొండ పైనుంచి భూమ్యాకర్షణ శక్తితో కిందికి వచ్చేలా లూజ్ గ్రావిటీ రైడ్లు కూడా పెట్టాలని గత ఆగస్టులో టెండర్లను ఆహ్వానించారు. ఈసారి పీపీపీ విధానంలో పెట్టారు. దీనికి రూ.60 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అయితే అధికారులు ఆశించినట్టుగా టెండర్లు రాలేదు. కేవలం ఒక్కటెండర్ వచ్చింది. మరికొందరు గడువు పెంచాలని, వ్యయం ఎక్కువ అవుతుందని, ఆదాయం పెద్దగా రాదంటూ సూచనలు చేశారు.

మళ్లీ టెండర్లు పిలుస్తాం

తెన్నేటి పార్కు నుంచి రోప్‌వే పెట్టాలని అనుకున్నాం. అయితే ఇందులో భాగంగా చేసిన లూజ్ గ్రావిటీ రైడ్ లాభదాయకం కాదనే అభిప్రాయం వ్యక్తమైంది. దానిని తొలగించి, కేవలం రోప్‌వే ఒక్కటే తెలుగు మ్యూజియం వరకూ వేయాలని అనుకుంటున్నారు. వ్యయం కూడా రూ.60 కోట్లు కావడంతో ఎవరూ ముందుకు రావడం లేదు. దానిని కూడా తగ్గించి మళ్లీ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించాము.

ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ.

సీతమ్మధార సబ్‌ట్రెజరీ విభజనకు మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

సాగిస్తున్నట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే ఎరియర్స్ డ్రా చేయని పింఛన్‌దారుల వివరాలు సేకరించి వారి కుటుంబ సభ్యులను సంప్రతిస్తుంటారని, అధ్యాపకులు/ఆచార్యులకు సంబంధించి వేతన సవరణ బకాయిలు మంజూరుచేసేందుకు భారీగా ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీతమ్మధారలో ఐదేళ్లుగా పనిచేస్తున్న ఒక సీనియర్ ఉద్యోగిని బదిలీ చేయకపోవడానికి సొమ్ములు చేతులు మారడమే కారణమంటారు. ప్రస్తుతం సీతమ్మధార డివిజనల్ సబ్‌ట్రెజరీలో సహాయ ఖజానాధికారి, ఇద్దరు ఉప ఖజానాధికారులు, ఆరుగురు సీనియర్, ఇద్దరు జూనియర్ అకౌంటెంట్లు, షరాఫ్ (రికార్డు అసిస్టెంట్), మరికొందరు అటెండర్లున్నారు. ప్రతి నెలా 20 వేల మందికి పింఛన్లు బట్వాడా చేయాల్సి ఉండడంతో ఒత్తిడి ఎక్కువగానే ఉంటుంది. కనీసం పది మంది సీనియర్, ఆరుగురు జూనియర్ అకౌంటెంట్లుండాలి. సిబ్బంది కొరత వల్ల తప్పులు జరుగుతున్నాయని ఉన్నతాధికారులు చెబుతున్నా అదనపు సిబ్బందిని నియమించడం లేదు. సీతమ్మధార సబ్‌ట్రెజరీపై ప్రభుత్వం దృష్టిసారించాలని పింఛన్‌దారులు కోరుతున్నారు.

ఉక్కులో బ్లాస్ట్‌ఫర్నేస్ జీఎం సస్పెన్షన్!

... 5వ పేజీ తరువాయి

నడిచే బ్లాస్ట్ ఫర్నేస్-3 నిర్వహణ కోసం ఆయన రష్యాలో ప్రత్యేక శిక్షణ పొంది వచ్చారన్నారు. అటువంటి వ్యక్తిని యాజమాన్యం అకారణంగా సస్పెండ్ చేసిందన్నారు. రోజుకు 19 వేల టన్నులు ఉత్పత్తి చేస్తామని ప్రభుత్వానికి యాజమాన్యం హామీ ఇచ్చిందని, అందుకు తగ్గట్టుగా ముడి వనరులు సమకూర్చలేకపోతోందన్నారు. సమస్యను పరిష్కరించుకోకుండా, బ్లాస్ట్‌ఫర్నేస్‌లను పర్యవేక్షిస్తున్న జీఎం నాగ్‌ను సస్పెండ్ చేసిందని ఆరోపించారు. ఆ స్థానంలో మెకానికల్ నిపుణుడిని నియమించారన్నారు. ఈ నిర్ణయం ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో కోక్ వినియోగం తగ్గించడం లేదని నాగ్‌ను సస్పెండ్ చేశారని, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ముడి పదార్థాలను వినియోగిస్తారని యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందని నరసింగరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్లాంటుకు నష్టం చేకూర్చాలనే ఆలోచనలో ఉన్నారని, ఉక్కు ఉత్పత్తుల నాణ్యతను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇందులో కలుగజేసుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ 8 వార్డుల్లో రూ.150 కోట్లతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 4వ వార్డు పాత పరదేశిపాలెంలో రూ.3.05 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు, కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నిధులతో నిడిగట్టు, జేవీ అగ్రహారం, కె.నగరపాలెం, కాపులుప్పాడ, చేపలుప్పాడ, పాతపరదేశిపాలెంలలో పలు అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. జీవీఎంసీ వార్డులన్నింటిలోను విలీన గ్రామాలతో ఏర్పడిన 4వ వార్డులో ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనరు అయ్యప్పనాయుడు, టీడీపీ 4వ వార్డు అధ్యక్షుడు పాసి నర్సింగరావు, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, టిడిపి నాయకులు బోర బంగారు రెడ్డి, బోర రాధాకుమారి, గరికిన ఎల్లయ్య (కింగ్), పాసి త్రినాథరావు, కొప్పల రమేష్, దేవాడ అప్పలకొండ రెడ్డి, కోడిబోయిన రాంబాబు, మొల్లి లక్ష్మణరావు, బోయి రమాదేవి, పోతిన ప్రసాద్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా

ఆర్టీసి కాంప్లెక్స్‌ను సత్వరం నిర్మించాలి

వ్యాపార కూడలిగా అభివృద్ధి చెందిన తగరపువలసలో తక్షణం ఆర్టీసి కాంప్లెక్స్ నిర్మించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు కోరారు. ఈమేరకు మంగళవారం వినతిని అందించారు. తగరపువలసకు పరిసర 60 గ్రామాల ప్రజలు వస్తుంటారన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. చిట్టివలస కొండపేటలో కల్యాణ మండపాన్ని నిర్మించాలని కోరారు. కుమ్మరిపాలెం రహదారికి మరమ్మతుల కోసం విన్నవించామన్నారు.

అనధికార నిర్మాణం తొలగించిన జీవీఎంసీ సిబ్బంది



తొలగించిన అనధికార నిర్మాణం

సాగర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ రీజనల్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉడా అప్రూవుడ్ లేఅవుట్‌లోని ఓ ప్లాట్‌లో అనధికార నిర్మాణాలను మంగళవారం తొలగించారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్టీడీ వుడా అప్రూవ్డ్ లేఅవుట్‌లో రెసిడెన్షియల్ నిమిత్తం కేటాయించిన స్థలంలో ప్రార్థన మందిరాన్ని (మసీదు) నిర్మించడంపై సాగర్‌నగర్ ఆర్టీడీ లేఅవుట్ ప్లాట్ ఓనర్స్, రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మసీదు నిర్వాహకులు వేర్వేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారించిన న్యాయస్థానం మసీదును తొలగించాలని తుది ఉత్తర్వులు జారీచేసింది. దీంతో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కోర్టు ఆదేశాల అమలుకు ప్రయత్నించడంతో ప్రార్థన మంది రం నిర్వాహకులు స్వచ్ఛందంగా తొలగించుకుంటామని తెలపడంతో వారికి అవకాశం ఇచ్చారు. విద్యుత్ శాఖ విద్యుత్ కనెక్షన్‌ను తొలగించింది.

కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం

కట్టడాలను తూతూమంత్రంగా తొలగించారు. నాలుగు మినార్లు, పలు కట్టడాలు మిగిలి ఉండటంతో ఆర్టీడీ లేవుట్ అసోసియేషన్ సభ్యులు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులకు, కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న దృశ్యం

మధురవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధి ఆర్టీసీ కాలనీలో గల షిర్డీసాయి ఆలయ 12వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయినాథుడికి మంగళవారం ఉదయం సుప్రభాత హారతితో పాటు భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం సాయికి పల్లకీసేవ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు వైసీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, షిర్డీసాయిబాబా ట్రస్ట్ చైర్మన్ తిరుపతిరాజు తదితరులు సాయినాథునికి విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రామారావు, నారాయణ తదితరులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'వైద్య విద్యను ప్రైవేటీకరించొద్దు'

మధురవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దని 7వ వార్డు వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. చంద్రంపాలెంలో పీపీపీ పద్ధతిలో వైద్యకళాశాలల ఏర్పాటును నిరసిస్తూ మంగళవారం కోటిసంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు పిళ్లా సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్యవిద్యను పేదలకు దూరం చేస్తే తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు.

గిరిజన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు

సాగర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, టీసీఆర్‌అండ్‌టీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ్‌దివస్-2025లో భాగంగా మంగళవారం రుషికొండ గాయత్రీవిద్యాపరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయి గిరిజన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వపోటీలు ప్రారంభమయ్యాయి. టీసీఆర్‌అండ్‌టీఎం ఈడీ డాక్టర్ రాణిమందా మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రతిబింబించే అద్భుత చిత్రలేఖనాలతో ప్రతిభను ప్రదర్శిస్తున్నారన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన ర్యాలీ

సాగర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ-2025)పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాతృభాషలో విద్యాబోధన, సాంకేతికతను అనుసంధానించడం, ప్రపంచస్థాయి ప్రమాణాలు నెలకొల్పడం, ప్రయోజనకరంగా నిలుస్తున్నాయని గీతం ప్రో వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. ఎన్‌ఈపీ ప్రయోజనాలపై విద్యార్థులు ప్రత్యేక గోడ పత్రికను, నినాదాలతో కూడిన బోర్డులను ర్యాలీలో ప్రదర్శించారు.

విద్యార్థులు పట్టుదలతో లక్ష్యం దిశగా సాగాలి

» దివీస్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న దివీస్ హెచ్‌ఆర్ జీఎం ఏఎస్ఎన్ రావు

భీమునిపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధన వైపు పట్టుదలతో అడుగులు వేయాలని చిప్పాడ దివీస్ కంపెనీ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రావు అన్నారు. భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో గౌరవప్రదమైన జీవితాన్ని జీవించాలని, దేశానికి సేవ చేయాలని కోరారు. అనంతరం రాష్ట్రంలో ఐఎస్‌బీఎన్ గుర్తింపు పొందిన కళాశాలగా కల్టీ డిసిప్లినరీ జర్నల్‌ను ఆయన ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ మాట్లాడుతూ సీనియరు విద్యార్థులు ఫ్రెషర్స్‌ను ప్రేమతో ఆహ్వానించి మంచి స్నేహ సంబంధాలతో వారికి గైడెన్స్ అందించాలన్నారు. ప్రత్యేక అతిథులుగా భీమిలి జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, జీవీఎంసీ కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి విచ్చేశారున. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వెంకటనారాయణ, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్‌పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులతో విద్యార్థులు

ఆనందపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వివిధ క్రీడల్లో పాల్గొంటున్న 30 మంది విద్యార్థులకు మంగళవారం టీషర్టులను గోకార్టింగ్ సంస్థ అధినేత బీవీ రమణ అందజేశారు. విద్యార్థులలో క్రీడాసక్తిని పెంపొందించేందుకు వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవరప్రసాద్

పద్మనాభం-రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బోని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు (ఆర్య గ్రామ సర్పంచ్ అవార్డు గ్రహీత) సురాల సత్యవరప్రసాద్ నాగవంశం సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. సోమవారం ఇందుఉ సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి.సత్యరావుకు ఈ పదవి రావడంపై పద్మనాభం మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, నగేష్‌కుమార్ దంపతులు, పీఏసీఎస్ అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు (అన్నమయ్య), పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన ఆర్జేడీ

ఆనందపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోఅసెస్‌మెంట్ పరీక్షలను మంగళవారం విద్యాశాఖ ఆర్జేడీ పరిశీలించారు. కోర్సులు ఎంతవరకు అయ్యాయో తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పరీక్షల నిర్వహణ సక్రమంగా జరగాలని, విద్యార్థుల స్థాయిని తెలుసుకోవడానికి పరీక్షలే కొలమానమని, మార్కుల ఆధారంగా గ్రూపులుగా విభజించి బోధించాలన్నారు. తక్కువ మార్కులు వచ్చిన వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని కోరారు.

నేటి నుంచి స్వామిత్ర గ్రామ సభలు

పద్మనాభం-రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం నుంచి స్వామిత్ర గ్రామసభలు నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో కె.రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న బుడ్డివలస అగ్రహారం, 17న చిన్నాపురం, శేరిఖండం, 20న బాందేవుపురం, కోరాడ, 21న కొవ్వాడ, పొట్నూరు, 22న అనంతవరం, మద్ది, 24న గంధవరం, రెడ్డిపల్లి, 25న పాండ్రంగి, రేవిడి, 26న విలాస్‌ఖాన్‌పాలెం, పెంట,గ్రామాల్లో ప్రత్యేక గ్రామ గ్రామసభలు ఫేజ్-2 నిర్వహించి ఆస్తుల వివరాల ధ్రువీకరణ కార్యక్రమం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

సింహాచలేశుడిని దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభం వద్ద పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దంపతులు, ఎమ్మెల్యేలు బండారు, గంటా, పంచకర్ల



అప్పన్నకు నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం పలువురు రాజకీయ, అధికార ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పీజీవీఆర్ నాయుడు(గణబాబు), మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాడుగుల ఎమ్మెల్యే, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ ఉత్తర నియోజక వర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, ఆదాయపన్నుశాఖ ప్రిన్సిపల్ కమీషనర్ బీ శ్రీనివాస్, జీవీఎంసి కార్పొరేటర్లు పిసిని వరాహ నరసింహం, సేనాపతి శంకరరావు, బళ్ల శ్రీనివాసరావు, ముమ్మన దేముడు, తదితరులున్నారు. ప్రముఖులకు దేవస్థానం ఈఓ ఎన్ సుజాత, ఏఈఓ కె తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్థంభ ఆలింగనం చేసుకున్న వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా అప్పన్న ఆర్జిత నిత్యకల్యాణం

సింహాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్యకల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దానిలో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామి, అమ్మవార్లకు, భక్తులకు తొలుత కంకణధారణలు కావించి స్వామికి నూతన యజ్ఞోపవీత ధారణ జరిపారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్రా బెల్లం, మాంగల్యసమర్పణలు చేసి అక్షితారోపణ జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాల తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అత్యవసర వైద్యం అందని ద్రాక్షే!

వరాహలక్ష్మీ నృసింహస్వామి భక్తులకు వైద్యం అందని ద్రాక్ష చందంగా మారింది. అప్పన్నస్వామి దర్శనానికి మంగళవారం నాయుడుతోట ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం మెట్ల మార్గంలో వస్తుండగా నాచు కారణంగా బాలిక జారి పడిపోయింది. నుదుటికి గాయమవడంతో సింహగిరికి చేరుకుని వైద్య సహాయం కోసం యత్నించారు. దేవస్థానానికి చెందిన అంబులెన్స్ ఉన్నప్పటికీ వైద్య సహాయకుడు లేకపోవడంతో డ్రైవర్ తనకు తోచిన ప్రాథమిక చికిత్స చేసి పంపేశాడు.

నేడు ఎన్టీఆర్ గృహాలు ప్రారంభం

పద్మనాభం-రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలో నిర్మించిన ఎన్టీఆర్ గృహాలను మంగళవారం ఉదయం 10 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్టు మండల గృహనిర్మాణ శాఖ ఏఈ ఆర్.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు హజరు కావాలని అమె కోరారు.

గీతంలో నేడు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఎండాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడానికి వీలుగా గీతం ఆసుపత్రిలో బుధవారం ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి ఆపరేషన్స్ విభాగాధిపతి డాక్టర్ భోగవల్లి కార్తీక్ పేర్కొన్నారు. పాప్ స్మియర్ పరీక్ష ద్వారా క్యాన్సర్ లక్షణాలు తెలుసుకోవచ్చన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 21 నుంచి 65 ఏళ్ల మధ్య వయసు మహిళలు మూడేళ్లకోసారి ఈ తరహా పరీక్షలు చేయించుకోవడం మేలన్నారు. గైనకాలజీ విభాగంలో ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు డాక్‌యార్డ్ వంతెన ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

నిర్మాణంలో ఉపయోగించిన ఇనుము తుప్పుపట్టకుండా విదేశాల నుంచి తీసుకువచ్చిన పెయింట్లను వేశారు. ఎలక్ట్రో మాగ్నిటిక్ బేరింగులను కూడా ఏర్పాటుచేశారు. పాదచారులు నడిచి వెళ్లేందుకు ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌ను నిర్మించారు. దీనికిందనే విద్యుత్ కేబుల్స్‌ను రన్ చేయడానికి ట్రాక్‌లను నిర్మించారు. కాగా రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వంతెనపై 15 విద్యుత్ దీపాలను అమర్చారు.

ప్రయాణం ఇలా..

పారిశ్రామిక ప్రాంతవాసులు నేరుగా వంతెన పైనుంచి ఎస్‌ఆర్ కంపెనీ మీదుగా కాన్వెంట్ వంతెనకు చేరుకుని, అక్కడి నుంచి నగరంలోకి వెళ్లవచ్చు, తిరిగి వచ్చేటప్పుడు జ్ఞానాపురం దాటిన తరువాత రామ్మూర్తిపంతులు పేట మీదుగా డాక్‌యార్డు క్వార్టర్స్ మార్గంలో వంతెనపైకి వచ్చి, అక్కడి నుంచి పారిశ్రామిక ప్రాంతానికి చేరుకోవచ్చు. వంతెన అందుబాటులోకి రానుండడంతో ప్రయాణాలకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరం తగ్గనుంది.

కార్తీక దీపోత్సవం విజయవంతం

» హిందూ ధర్మ ప్రచార పరిషత్

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్తీక దీపోత్సవం విజయవంతమైందని విశాఖపట్నం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఒక ప్రకటనలో తెలిపింది. బీచ్‌రోడ్డులోని ఎంజీఎం పార్కు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అయిదు వేల మందికి ఉచిత ప్రవేశ టోకెన్లను జారీ చేశామని, వారికి మాత్రమే దీపోత్సవానికి అనుమతించామని తెలిపారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం కోసం 300 మంది శ్రీవారి సేవకులు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ బృందం సమన్వయంతో, పోలీసుల సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్టు పరిషత్ పేర్కొంది. మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటు సభ్యుడు శ్రీభరత్, తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారని తెలిపింది. హిందూ ధర్మప్రచార పరిషత్ తరఫున ప్రజా ప్రతినిధులకు, భక్తులకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ దన్యవాదాలు తెలిపింది.

కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధికి చర్యలు

» మేయర్ పీలా శ్రీనివాసరావు
» పార్వతీనగర్‌లో రూ.1.26 కోట్లతో నిర్మించనున్న రక్షణ గోడకు శంకుస్థాపన
» పాల్గొన్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే వెలగపూడి



పార్వతీనగర్ కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్, పీలా శ్రీనివసారావు, ఎమ్మెల్యే ఎంపీ శ్రీభరత్, 'తూర్పు' ఎమ్మెల్యే రామకృష్ణబాబు, కార్పొరేటర్లు సునీత, రామలక్ష్మీ తదితరులు

ఆరిలోవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొండవాలు ప్రాంతాల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్టు మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డులోని పార్వతీనగర్‌లోని బీసీ కాలనీ కొండవాలు ప్రాంతంలో రూ.1.26 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న రక్షణగోడ నిర్మాణానికి మంగళవారం ఆయన, ఎంపీ ఎం.భరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ అక్కరమాని రోహిణిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కొండవాలు ప్రాంతంలో నివసించే ప్రజల రక్షణ కోసం అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటామనిహామీ ఇచ్చారు. కూటి ప్రభుత్వం విశాఖపట్నంను ఆర్థిక నగరంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకొంటోందని,ఈ క్రమంలో నగరంలోని అన్ని ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ నెల 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు వంటి భారీ కార్యక్రమాలు విశాఖ నగరంలో జరగనుందని, ఇలాంటి సదస్సులు మరిన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేయనుందన్నారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, నగరంలో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తోందన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ యూనిట్ల స్థాపనకు శంకుస్థాపన

ఆరిలోవ : ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పైనాలపిల్ కాలనీలో మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ద్వారా 1.18 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న 31 యూనిట్ల స్థాపనకు మంగళవారం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యూనిట్ల స్థాపన వల్ల యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో 13, 10 వార్డుల కార్పొరేటర్లు కెల్ల సునీత, మద్దిల రామలక్ష్మి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఏపీఐఐసీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ పనులపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ పనులపై చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం తన చాంబర్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీలకు నిర్దేశించిన ప్రకారం ఇంజనీరింగ్ పనులు కేటాయించాలన్నారు. మాస్టర్ ప్లాన్ పనుల్లో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించి, వాటిని సకాలంలో పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. నగర పాలక సంస్థ అధికారులతో సమన్వయం చేసుకొని, గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. ఇంకా ప్రారంభం కాని పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఆమోదం పొందిన పనులన్నింటినీ ప్రారంభించి, పూర్తి చేసేందుకు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. సమీక్షలో ఇంజనీరింగ్ అధికారులు భవానీశంకర్, మధుసూదనరావు, రాంబాబు, రాజు, సుధీర్, దుర్గాప్రసాద్, రామరాజు పాల్గొన్నారు.

సీఐఐ సదస్సుకు పటిష్ఠ భద్రత : సీపీ



ఏయూ మైదానంలో భాగస్వామ్య సదస్సులో భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు భద్రత ఏర్పాట్లను మంగళవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షించారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో హెలిపాడ్, సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు బస చేసే హోటళ్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఏయూ మైదానంలో చేపడుతున్న భాగస్వామ్య సదస్సుకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీఐపీలు ప్రయాణించే రహదారుల్లో ఏఎస్‌సీ, ఆర్‌వోపీలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

బందోబస్తులను కేటగిరిలుగా విభజించి ఒక్కో విభాగం పర్యవేక్షణను ఉన్నతాధికారిని నియమించినట్టు తెలిపారు. ముఖ్య ప్రాంతాల్లో పికెట్స్ ఏర్పాటు చేసి నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో సదస్సు చుట్టూ నిఘా ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు.

విద్య శక్తివంతమైన ఆయుధం : ఎంపీ శ్రీ భరత్

» ఎంపీ శ్రీభరత్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఎంవీపీ కాలనీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : విద్య అనేది జీవితాలను మార్చగలిగే అత్యంత శక్తివంతమైన ఆయుధం అని పార్లమెంటు సభ్యుడు శ్రీభరత్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం కళాశాల ఆడిటోరియంలో జరిగిన జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే సామాజిక స్థితిగతులు మారుతాయని, అందుకే ప్రతి విద్యార్థి లక్ష్యసాధనకు కట్టుబడి, కష్టపడాలన్నారు. ఉన్నత స్థితికి చేరిన తర్వాత సమాజానికి సేవ చేయడమే బాధ్యతగా భావించాలని తెలిపారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రస్టు ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఆజాద్‌కు నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ మధురవాణి, విద్యార్థులు

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులోని గాయత్రి విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి మాట్లాడుతూ బాలలందరూ విద్యావంతుల కావాలని సూచించారు. దేశాభివృద్ధికి మానవవనరులు బలమైన పునాది అన్నారు. ఆ మానవ వనరుల బలోపేతానికి విద్య ప్రధానమని పేర్కొన్నారు. కార్యక్రమలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేసే వారికి సహకారం అందిస్తాం

» సౌత్ ఆసియా ఎల్పీజీ కంపెనీ సీఈవో రిచా షిండే



ఆస్పత్రిలో నూతన బ్లాక్‌ను ప్రారంభిస్తున్న రిచా షిండే

సిరిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సేవాభావంతో పని చేసే వారికి తమ వంతు సహకారం అందిస్తామని సౌత్ ఆసియా ఎల్పీజీ కంపెనీ సీఈవో రిచా షిండే అన్నారు. గంభీరంలో స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన బ్లాక్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. రోగులను ఆస్పత్రిలో ఇన్ పేషెంట్‌గా ఉంచి సేవలు అందించేందుకు, అలాగే రెండు నర్సింగ్ స్టేషన్లు, అవసరమైన వైద్య సదుపాయాలతో కూడిన బ్లాక్‌ను సీఎస్‌ఆర్ ఫండ్ కింద సౌత్ ఆసియా ఎల్పీజీ కంపెనీ వారు నిర్మించారు. వీటిని ప్రారంభించిన అనంతరం రిచా షిండే మాట్లాడుతూ వృద్ధాప్యంలో అవసరమైన వైద్యం, ఇతర సాయం కోసమని ఎంతో మంది ఎదురు చూస్తున్నారని, అలాంటి వారి కోసం స్నేహసంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ పని చేస్తుండటం అభినందనీయమన్నారు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం పాటు పడుతున్న ఇలాంటి సంస్థ కార్యకలాపాల్లో ఈ రీతిన తాము కూడా భాగస్వామ్యులం అవుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఫౌండేషన్ ట్రస్టీ డాక్టర్ ఎన్ఎస్ రాజు, చైర్మన్ డాక్టర్ జి.సాంబశివరావు మాట్లాడుతూ ఎస్ఏఎల్‌పీజీ సంస్థ వారు అందిస్తోన్న సహకారం తమ సేవలు మరింత విస్తరించేందుకు దోహదంగా నిలుస్తాయన్నారు. వైద్యపరమైన అవసరాలకు అనుగుణంగా తోడ్పాటు అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా ఎల్పీజీ సీఈవో రిచా షిండేను ఫౌండేషన్ తరుపున సన్మానించారు.

ఆజాద్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

» బాలవికాస్ పౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు



ఆజాద్‌కు నివాళులు అర్పిస్తున్న నరవ ప్రకాశరావు, బాలికల గృహం ఇన్‌చార్జ్ రమణమ్మ, సిబ్బంది

ఆరిలోవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర సమరయోధుడు, దేశానికి తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలామ్ అజాద్ 137వ జయంతి సందర్భంగా బాలవికాస్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో చినగదిలి రూరల్ మండల కార్యాలయంకి సమీపంలో గల ప్రభుత్వ బాలికల గృహంలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.తొలుత బాలవికాస్ పౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తి కావాలని అన్నారు. ఆయన 11 ఏళ్ళ పాటు విద్యాశాఖామంత్రిగా పని చేసి ప్రాథమిక, ఉన్నత విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వం ఆజాద్ సేవలను గుర్తించి ఆయనకు భారత రత్న అవార్డును ఇచ్చి గౌరించిందన్నారు. ఆయన జన్మదినం రోజు జాతీయ విద్యాదినంగా ప్రకటించడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో బాలికలగృహం ఇన్‌చార్జ్ నయోమి రమణమ్మ, సిబ్బంది సరస్వతి చాట్ల, బాబూరావు రెడ్డి.డాక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **ది గర్ల్ ఫ్రండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
● **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **జటాధర** : శారదా, శ్రీకన్య
● **బ్యాడ్ ల్యాండ్స్/ఫెనిక్స్** : రమాదేవి
● **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
● **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 26, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 50, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 60, దొండకాయలు 54, బంగాళ దుంపలు18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఏయూలో విద్యార్థుల బాహాబాహీ

» శ్రీకృష్ణదేవరాయల వసతి గృహంలో రెండు రోజులు కిందట గొడవ
» కార్లతో వచ్చి హల్‌చల్ చేసిన బయటి విద్యార్థులు.. కేసు నమోదు



శ్రీకృష్ణదేవరాయ హాస్టల్ ఆవరణలో గొడవ పడుతున్న విద్యార్థులు



బయట విద్యార్థులు తీసుకొచ్చిన కారు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్శిటీలోని శ్రీకృష్ణ దేవరాయల వసతి గృహంలో హాస్టల్‌కు చెందిన విద్యార్థులు, బయటి విద్యార్థులకు మధ్య గొడవ జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ గొడవకు సంబంధించి విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. వర్శిటీలో ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థి వినోద్ కొద్ది రోజులుగా ఇదే హాస్టల్‌లోని ఒక రూమ్‌లో ఉంటున్నాడు. సాధారణంగా కోర్సు పూర్తయిన తరువాత విద్యార్థులు వసతిగృహం ఖాళీ చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్న వెంకటరమణ, సతీష్‌ల రూమ్‌లో ఉంటున్నాడు. అయితే, వినోద్ ఎప్పటికప్పుడు బయట వ్యక్తులను హాస్టల్‌లోకి తీసుకురావడం పట్ల ఇబ్బంది పడుతున్న వెంకటరమణ, సతీష్‌లు రూమ్‌కు రావద్దని సూచించారు. దీనిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తంచేసిన వినోద్ శనివారం రాత్రి కొంత మంది స్నేహితులను వెంటబెట్టుకుని కార్లలో హాస్టల్‌కు వచ్చి వీరంగం సృష్టించారు. ఈ క్రమంలోనే హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు, బయటి నుంచి కార్లతో వచ్చిన వారికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకానొకదశలో కొట్లాటకు దిగినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించిన కొందరు... అధికారులకు సమాచారాన్ని ఇచ్చారు. అధికారులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. దీనిపై వర్శిటీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు ఇరువర్గాలపై కేసునమోదు చేశారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా అప్పలనాయుడు



ఆరిలోవ, నవంబరు11(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు నియమితులయ్యారు. తన నిమామకానికి కృషి చేసినఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మికి ఈ సందర్భంగా అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

16న రాష్ట్ర శెట్టిబలిజ వన సమారాధనను విజయవంతం చేయండి

వెంకోజీపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16న రాష్ట్ర శెట్టిబలిజ సంఘం నిర్వహిస్తున్న వనసమారాధనను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. అలాగే దే విదంగాలాఆవిశాఖలో జనవరి 6న నిర్వహించే గీత సంబంధిత కులాల వనసమారాధనకు సంబంధించి మంత్రి పలు సూచనలు చేశారు. మంగళవారం నగరానికి విచ్చేసిన మంత్రిని 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు అప్పారి గిరిబాబు, వార్డులోని శెట్టిబలిజ సేవా సంఘం సభ్యులు కలిసి వనసమారాధన కోసం మాట్లాడారు. మంత్రిని కలిసిన వారిలో సంపంగి శ్రీను, కట్టా మల్లేశ్వరరావు, రెడ్డి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన గోవింద్, నరాల సత్తిబాబు, సంపంగివాసు తదితరులుపాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి పూజలు



అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడో మంగళవారం పురస్కరించుకొని కొత్త వెంకోజిపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం శ్రీగౌరీజ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలో వేంచేసియున్న నాగదేవత, శివుడు సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని విశేష అభిషేకాలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పంచదార. పసుపు, కుంకుమ, విభూది, పుష్పాలు,రోజ్‌వాటర్ తదితర వాటితో స్వామి వారిని భక్తులు స్వయంగా అభిషేకం జరిపారు. భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

'మా వ్యాపారాలను అడ్డుకోవద్దు'

» సీఐఐ సదస్సు నేపథ్యంలో బీచ్‌రోడ్డు చిరు వ్యాపారుల వినతి

రామ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో జరిగే సీఐఐ పెట్టుబడుల సదస్సు కారణంగా ఐదు రోజులు పాటు బీచ్‌రోడ్డులోని చిరు వ్యాపారస్తులను వ్యాపారాలు చేయకుండా నిలుపుదల చేస్తే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటా మని విశాఖ నగర బీచ్ వీధి చిల్లర వర్త కులు సంక్షేమ సంఘం ప్రదాన కార్యదర్శి తెడ్డు శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బీచ్ చిల్లర వర్తకులు సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ ప్రత్యేక పట్టణ ప్రణాళిక అధికారికి వినతిపత్రాన్ని అందించారు, భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు కోసం బీచ్‌లో చిరువ్యాపారులు ఎవ్వరూ ఈ నెల 12 నుంచి 16 ఐదు రోజులు పాటు వ్యాపారులు చేయవద్దని జీవీఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారని, అలా వ్యాపారలు చేయవద్దంటే తమ పరిస్థితి ఏం కావాలన్నారు. చిరు వ్యాపారాలు లేకుండా పర్యాటకులు కూడా ఇబ్బందులకు గురవుతారనే విషయం గమనించాలన్నారు. అందువల్ల సదస్సు లు జరిగే రెండు రోజుల పాటు స్వచ్ఛం దంగా తమ వ్యాపారాలు మూసివేస్తామని, అందుకు అంగీకరించాలని కోరారు, కానీ రోజుల తరబడి వ్యాపారాలు చేయనీయకుంటే ఆర్థికంగా ఇబ్బందులు పడతామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దిండు తిరుమలరావు, గిడుతూరి శ్రీను, సీహెచ్ రమణ, కట్టా శ్రీను అప్పారావు, త్రినాథ్, హేమలత పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రాణం రీసెర్చ్ మెథడాలజీ

» ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ పి.కింగ్



ఆజాద్‌కు నివాళులు అర్పిస్తున్న రెక్టార్ కింగ్, తదితరులు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలకు ప్రాణంగా రీసెర్చ్ మెథడాలజీ నిలుస్తుందని ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ పి.కింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఏయూ విద్యా విభా గం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న రెండు రోజుల వర్క్ షాప్ రీసెర్చ్ మెథడాలజీని ఆయన ప్రారంభించారు. ముందుగా దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. జాతీయ విద్యా దినోత్సవం రోజున ఇటువంటి కార్యక్రమాన్ని ప్రారంభిం చడంపై నిర్వాహకులను అభినందించారు. సామర్థ్యాలను పెంపొందించడానికి వర్క్‌షాప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్ర మాలు దోహదపడతాయన్నారు. పరిశోధనలో ముందుగా సమస్యను గుర్తించడం ప్రధామన్నారు. దీనికి లిటరేచర్ రివ్యూ అవసరమన్నారు. నాణ్యమైన పరిశోధనలు జరపడం ప్రధానమన్నారు. విద్యార్థి తనపై తాను నమ్మ కం కలిగి ఉండడం, పరికరాలు పరిశోధన నాణ్యతను ప్రభావితం చేస్తాయన్నారు. విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ టి.షారోన్ రాజు మాట్లాడు తూ దేశాభివృద్ధికి పరిశోధనలు ప్రభావవంతంగా నిలుస్తాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిశోధనలో నాణ్యత పెంపుదల అవసరమ న్నారు. పరిశోధకు లకు, ఆచార్యులకు ఉప యుక్తంగా నిలిచే విధంగా రీసెర్చ్ మెథడాలజీపై ప్రత్యేకంగా వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమం లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యా విభాగ పూర్వ ప్రొఫెస ర్లు ఎస్. పద్మనాభయ్య, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, ప్రొఫెసర్ ఎంటీవీ నాగరాజు, ప్రొఫెసర్ ఎస్.పాల్ డగ్లస్, ప్రొఫెసర్ టి.షారోన్‌రాజు, ప్రొఫెసర్ డి.నాగరాజ కుమారి రచించిన రీసెర్చ్ మెథడాలజీ ఇన్ టీచర్ ఎడ్యుకేషన్ పుస్తకాన్ని రెక్టార్ ఆవిష్కరించారు.



అల్లిపురంలో ద్రాక్షపండ్లతో గౌరీపరమేశ్వరుల అలంకరణ

అల్లిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం వేంకటేశ్వరమెట్ట వద్ద గౌరీ సేవా సంఘం, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న 78వ గౌరీపరమేశ్వరుల లీలా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్సవమూర్తులను ద్రాక్షపండ్లతో అలంకరించారు. ఈ నెల 15న అనుపు మహోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొలమరశెట్టి వెంకట శ్యామ్‌కుమార్, పొలమరశెట్టి శ్రీను తెలిపారు.

కేజీహెచ్ లిఫ్టులో ఇరుక్కుపోయిన రోగులు

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో రోగులు లిఫ్ట్‌లో ఇరుక్కున్నారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఉన్న లిఫ్ట్‌లోకి మంగళవారం ఉదయం కొందరు ప్రవేశించారు. కానీ అది తెరుచుకోలేదు. దీంతో లోపల ఇరుక్కుపోయిన రోగులు తదితరులు ఆందోళనకు గురయ్యారు. దీనితో గందరగోళ పరిస్థితి తలెత్తింది. కొద్దిసేపటి తరువాత సిబ్బంది సరిచేసి లోపల ఉన్నవారిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం లిఫ్ట్ యథావిధిగా పనిచేసింది. లిఫ్టులోకి పరిమితికి మించి జనం వెళ్లడంతో సాంకేతిక సమస్య ఏర్పడినట్లు సిబ్బంది తెలిపారు. కేజీహెచ్‌లో మొత్తం 17 లిఫ్టులు ఉండగా రెండు సాంకేతిక కారణాలతో పనిచేయటం లేదు. మిగిలినవన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయి.

ఇద్దరికి సీఎం సహాయ నిధి మంజూరు చెక్కులు

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అనారోగ్య పీడితులకు సీఎం సహాయ నిధి మంజూరు చెక్కులను ఎంపీ శ్రీభరత్ అందజేశారు. ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన ముక్కా శ్రీను, సింగమాపల్లిలకు రూ.1,21,329, రూ.50 వేల వంతున రెండు చెక్కులను మంగళవారం అందజేశారు. ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నాయుడు బాధ్యతల స్వీకరణ

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెషన్స్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది పీఎస్ నాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకేశ్రీనివాస్, ఎల్‌పీ నాయుడు, ఎస్.కృష్ణమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాన్యం ప్రాంతానికి వీధి దీపాల వెలుగులు

మాధవధార, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి); నెలల తరబడి చీకట్లలో మగ్గుతున్న మాధవధారలోని మాన్యం నివాసిత ప్రాంతానికి ఎట్టకేలకు వెలుగులు కల్పించారు. జీవీఎంసీ వీధి దీపాల నిర్వహణ విభాగం, ఈపీడీసీఎల్ సబ్‌స్టేషన్ నిర్వహణ అధికారులు సంయుక్తంగా చేపట్టిన మరమ్మతుల వల్ల పాడైన దీపాల పునరుద్ధరణ జరిగింది. స్థానికుల విన్నపం మేరకు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యలు చేపట్టినట్లు 50వవార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ తెలియజేశారు. పలు స్తంభాలపై వెలగని దీపాలకు మరమ్మతులు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చీకటి సమస్యను నివారించి కొత్త వెలుగులు కల్పించారని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

టీడీపీ వార్డు అధ్యక్షునిగా కండిపల్లి సతీష్ కుమార్



మహారాణి పేట, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ మంగళవారం కండిపల్లి సతీష్‌ను 29వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. మహారాణిపేట వాసి అయిన సతీష్‌కు పార్టీలో 20 ఏళ్ల రాజకీయ అనుభవం ఉంది. రెండుసార్లు యువత అధ్యక్షునిగా వ్యవహరించారు. బుధవారం పార్టీ బాధ్యతలు చేపడతారు.

భాగస్వామ్య సదస్సుకు చకచకా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

గదులు కేటాయించాలని నిర్ణయించారు. అయితే సదస్సుకు వచ్చే ప్రముఖుల ఎంత మంది అనే లెక్కలు మారుతున్నాయి. దాంతో వారికి వసతి, రవాణా సదుపాయాల కల్పనలో అంచనాకు రాలేకపోతున్నారు. రోజురోజుకూ అతిథుల సంఖ్య పెరుగుతుండడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.



కలెక్టరేట్‌లో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలలో పాల్గొన్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, మైనారిటీ మత పెద్దలు



జనసేన కార్యాలయంలో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఇతర నాయకులు

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు ఘన నివాళి

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని జాతీయ విద్య, మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా పాటించడంతో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆనందపురం మండలం వీకేరులో నాలుగు ఎకరాల భూమిని ముస్లింల శ్మశానవాటికగా కేటాయించామన్నారు. పెందుర్తిలో కూడా భూమి కేటాయింపు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మైనారిటీ సొసైటీ భూములను 22-ఎ నుంచి విడిపించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మత పెద్దలు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర మైనారిటీ శాఖ కార్యదర్శి మహ్మద్ నజీర్, మహ్మద్ గౌస్, సాదిక్, డీఎంవో సత్య పద్మ సుబానీ, ఎండీ రఫీ, మత పెద్దలు పాల్గొన్నారు.

జిల్లా టీడీపీ కార్యాలయంలో...

మహారాణిపేట: అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విశాఖ జిల్లా ముస్లిం మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆజాద్ చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ పూలమాల వేసి నివాళులర్పించారు. విద్య విలువను దేశ ప్రజలకు తెలియజెప్పారని అన్నారు. మహ్మద్ రఫీ, అబ్దుల్ చినరహమాన్, మహ్మద్‌గౌస్, షేక్ రహ్మతుల్లా, జఫ్రుల్లా, అబ్దుల్ అనీఫ్, సుబానీ అబ్దుల్, సలీమ్, యాసిన్, షేక్ అలీ పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో...

సీతంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అబుల్ కలామ్ ఆజాద్ దేశానికి చేసిన సేవలు మరువలేమని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహమాన్ తదితరులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెహమాన్ మాట్లాడుతూ ఆజాద్ అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర భాషలలో ప్రావీణ్యుడన్నారు. కార్పొరేటర్లు మహమ్మద్ సాదిక్, కందుల నాగరాజు, ఎం.రాజు, ఆళ్ల శ్రీను, సౌత్ జనసేన ఇంచార్ శివప్రసాద్ రెడ్డి, నాయకులు లక్ష్మి, అమరాపు దుర్గ, కొల్లి సింహాచలం, దువ్వి గోవింద్, వార్డు అధ్యక్షులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.



జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

చదువే మనిషిని మహోన్నతుడిని చేస్తుంది

ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహాన్ని తనిఖీ చేసిన మంత్రి డా.స్వామి



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ఇన్‌చార్జి మంత్రి డా.శ్రీ బాలవీరాంజనేయస్వామి

డాబాగార్డెన్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చదువే మనిషిని మహోన్నతునిగా చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం రాత్రి సిటీ సెంట్రల్ పార్కు వద్ద ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో ఆహార నాణ్యతను మంత్రి పరిశీలించారు. విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసు అధికారులు

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని హార్బర్ పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అక్కయ్యపాలెం నందగిరి కాలనీకి చెందిన రుషి మిశ్రా (5) మంగళవారం మధ్యాహ్నం ఇంటి పక్కనే ఉన్న షాపు వద్దకు వెళ్లేందుకు బయటకు వచ్చి తప్పిపోయాడు. అక్కడ నుంచి సుమారు 4 కిలోమీటర్లు ఆవల ఉన్న కాన్వెంట్ జంక్షన్ వరకు వెళ్లిపోయాడు. అక్కడ ఏడుస్తున్న బాలుడ్ని విధులలో ఉన్న ఏఎస్ఐ సీహెచ్ మూర్తి, హెడ్ కానిస్టేబుల్ ఎస్.సురేష్‌లు దగ్గరకు తీసుకొని ఆరా తీసినా ఫలితం లేక హార్బర్ స్టేషన్‌కు తీసుకువచ్చి భోజనం పెట్టారు. స్టేషన్‌లో ఉంచి ఆడిస్తూ వివరాల కోసం ప్రయత్నించారు. ఈలోగా నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు రావటంతో తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి సీఐ సీహెచ్ సింహాద్రి నాయుడు వారికి అప్పగించారు, తమ కుమారుడు తమ చెంతకు చేరటంతో బాలుడి తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హార్బర్ పోలీసు సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

బాస్కెట్‌బాల్, వాలీబాల్ టోర్నీ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఆచార్య కె.రాంబాబు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్, వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఏయూ సిల్వర్ జూబ్లీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పోటీలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అంతర్ కళాశాలల టోర్నీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను త్వరలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో విద్యతోపాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ గోపీకృష్ణ, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో బ్లాస్ట్‌ఫర్నేస్ జీఎం సస్పెన్షన్!

... 5వ పేజీ తరువాయి

నడిచే బ్లాస్ట్ ఫర్నేస్-3 నిర్వహణ కోసం ఆయన రష్యాలో ప్రత్యేక శిక్షణ పొంది వచ్చారన్నారు. అటువంటి వ్యక్తిని యాజమాన్యం అకారణంగా సస్పెండ్ చేసిందన్నారు. రోజుకు 19 వేల టన్నులు ఉత్పత్తి చేస్తామని ప్రభుత్వానికి యాజమాన్యం హామీ ఇచ్చిందని, అందుకు తగ్గట్టుగా ముడి వనరులు మాత్రం సమకూర్చలేకపోతోందన్నారు. ఆ సమస్యను పరిష్కరించుకోకుండా, బ్లాస్ట్‌ఫర్నేస్‌లను పర్యవేక్షిస్తున్న జీఎం నాగ్‌ను సస్పెండ్ చేసిందని ఆరోపించారు. ఆ స్థానంలో మెకానికల్ నిపుణుడిని నియమించారన్నారు. ఈ నిర్ణయం ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో కోక్ వినియోగం తగ్గించడం లేదని పేర్కొంటూ నాగ్‌ను సస్పెండ్ చేశారని, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ముడి పదార్థాలను వినియోగిస్తారని ఆ విషయం గుర్తించకుండా యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందని నరసింగరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఏదో ఒక విధంగా ప్లాంటుకు నష్టం చేకూర్చాలనే ఆలోచనలో ఉన్నారని, అలాగే విశాఖ ఉక్కు ఉత్పత్తుల నాణ్యతను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇందులో కలుగజేసుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిత్రలేఖన పోటీలకు విద్యార్థుల ఎంపిక



పి.జగన్నాథ్



శ్రీహర్ష

సీతంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంధన సామర్థ్యం, పరిరక్షణపై అవగాహన పెంపొందించడానికి భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బిఇఇ) ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న చిత్రలేఖన పోటీలో సీతంపేట మధురానగర్‌లోగల జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని డ్రాయింగ్ మాస్టర్ ఎం.భాస్కర్ తెలిపారు. అక్టోబరు 23న పాఠశాలల స్థాయి పోటీల్లో 52 మంది పాల్గొనగా, అందులో నలుగురు విద్యార్థుల పెయింటింగ్స్‌ను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి (ఎన్‌టిపిసి)కి పంపారు. అందులో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌కి చెందిన 7వ తరగతి విద్యార్థి బి.శ్రీహర్ష జూనియర్ విభాగంలో, 9వ తరగతి చదువుతున్న పి.జగన్నాథ్ సీనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 19న జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనన్న సందర్భంగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస, చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఎం.భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.



చిత్రలేఖన పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నారాయణ విద్యార్థుల ఎంపిక

డాబాగార్డెన్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి చిత్రలేఖన పోటీకి నగరంలోని నారాయణ పాఠశాలల్లో చదువుతున్న ఆదో తరగతి విద్యార్థి యువరాజు, తొమ్మిదో తరగతి చదువుతున్న యశిత, హేమలస్యలతో పాటు 19 మంది ఎంపికయ్యారని ఏజీఎం రాజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కొరాపుట్ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులోని దిమిలి, కొరాపుట్ సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సెక్షన్‌లో దిమిలి, కొరాపుట్, జగదల్‌పూర్, సిలక్‌జోరి స్టేషన్లు, యార్డులు, రైల్వే కాలనీలలో విస్తృతంగా పర్యటించారు. ఎల్‌సి గేట్లు, మలుపులు, పాయింట్లు, క్రాసింగ్, సిగ్నల్ పరికరాలు, ఎలక్ట్రికల్ యూనిట్ల పనితీరు, వాటి నిర్వహణను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యాలు, సిబ్బంది క్వార్టర్లలోని సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. జగదల్‌పూర్, నక్తిసేమ్రా మధ్య గల క్రాసింగ్ గేట్ నంబరు కెకె-88ను పరిశీలించి భద్రతా ప్రమాణాల నిర్వహణపై సిబ్బందితో చర్చించారు. జగదల్‌పూర్ స్టేషన్‌లో హెల్త్ యూనిట్, రన్నింగ్ రూమ్‌లను పరిశీలించి, రైల్వే కాలనీలలో నివాసితులిచ్చిన ఫిర్యాదులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ స్టేషన్లలో జరుగుతున్న పనులపై సమీక్షించారు. మల్లిగూడ స్టేషన్‌లోని సదుపాయాలు, స్టేషన్ యార్డులను పరిశీలించారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు మేలుచేసే సదస్సులు కావాలి

» లేబర్ సమ్మిట్‌లో వక్తల ఉద్ఘాటన

డాబాగార్డెన్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమ్మిట్‌ల పేరుతో కార్పొరేట్లకు వరాలు కురిపిస్తూ, కార్మికులపై భారాలు నెట్టేస్తున్నారని పలువురు వక్తలు విమర్శించారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లేబర్ సమ్మిట్-2025 సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ కె.ఎస్.చలం మాట్లాడుతూ ఈ సమ్మిట్ ద్వారా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని, లక్షలాది మందికి ఉపాధి వస్తుందని కూటమి ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో కూడా ఇలాంటి సదస్సులు అనేకం జరిగాయని, కానీ ఎక్కడా కొత్త పరిశ్రమలు, ఉపాధి పరిస్థితి రాలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్‌తో ఉపాధి పెద్దగా అవకాశం రాదని, విద్యుత్, నీటి వినియోగం భారీగా పెరుగుతుందని తద్వారా ఉష్ణోగ్రతలలో మార్పులు సంభవించి, పర్యావరణానికి ముప్పువాటిల్లుతుందని తెలిపారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, ఏయూ లా కళాశాల ప్రొఫెసర్ నిర్మల మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలు కాపాడే సదస్సు కావాలని, దాని కోసం కార్మికవర్గమంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ అధ్యక్షత వహించగా, డి.ఆదినారాయణ, అచ్యుతరావు, నాగభూషణం, జెఅయోధ్యరామ్, సాగర్, ప్రకాష్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, నాయుడు, కుమార మంగళం తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ కె.ఎస్.చలం, చిత్రంలో ఇతర ప్రముఖులు

'సెలబ్రేషన్స్'లో నిల్వ ఆహారం

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటళ్లలో నిల్వ ఆహార పదార్థాల విక్రయం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు తరచుగా తనిఖీలు చేసి, కేసులు నమోదుచేస్తున్నా ఫలితం ఉండడం లేదు. తాజాగా ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఇదే విషయంపై అధికారులకు ఫిర్యాదుచేశారు. అక్కయ్యపాలెం ప్రాంతంలో ఉన్న 'సెలబ్రేషన్స్' హోటల్‌లో నిల్వ ఆహారాన్ని విక్రయిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ ఇన్‌స్పెక్టర్ అప్పారావు మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టి, సుమారు 12.3 కిలోల నిల్వ ఆహార పదార్థాలను గుర్తించారు. ఇందులో చికెన్, ఫిష్, ఫ్రైడ్ రైస్, పప్పు వంటివి ఉన్నాయి. నిల్వ ఉంచిన ఆహారాన్ని వేడి చేసి విక్రయిస్తున్నట్టు నిర్ధారించిన అధికారులు హోటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. అలాగే ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. దీనిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు మాట్లాడుతూ మిగిలిపోయిన ఆహార పదార్థాలను రెండేసి రోజులపాటు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి వేడి చేసి కస్టమర్లకు వడ్డిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు.

పరిశుభ్రతను పరిశీలించాలి: ఎమ్మెల్యే

ప్రజలు బయట ఆహారం తినేటప్పుడు పరిశుభ్రత, ఆహార తయారీకి ఉపయోగించే పదార్థాల నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సూచించారు. ఆహార భద్రత, ప్రమాణాల శాఖ తనిఖీల నేపథ్యంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హోటళ్ల యజమానులు, చిరు వ్యాపారులు పరిశుభ్రత, నాణ్యతను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు.

నిఘా నీడలో విశాఖ

... 5వ పేజీ తరువాయి

విశాఖ జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. విశాఖ నగరమంతా డ్రోన్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమ్మిట్‌కు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు సహా జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరవుతారని, అందుచేత నగరమంతా కట్టుదిట్టమైన భద్రత చేపట్టాలన్నారు. ఫైర్ సేఫ్టీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా వుంచాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని, ఉన్నతాధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు.

జిల్లాలో 5 ఎంఎస్‌ఎంఈ పార్కులు

... 5వ పేజీ తరువాయి

27,600 చ.అ. విస్తీర్ణంలో వస్తుంది. అందులో 31 షెడ్లు/షాపులు వస్తాయి.

3. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వెంకటాపురంలో 2.45 ఎకరాల విస్తీర్ణంలో రూ.15.2 కోట్లతో ఒక పారిశ్రామిక పార్కు వస్తుంది. అందులో 23,800 చ.అ. విస్తీర్ణంలో 23 షెడ్లు/షాపులు నిర్మిస్తారు.

4. పెందుర్తి నియోజకవర్గంలోని గుర్రంపాలెంలో 63.37 ఎకరాల్లో ప్రైవేటు పారిశ్రామిక పార్కును జె.కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ నిర్మిస్తుంది. దీని అంచనా వ్యయం రూ.237.71 కోట్లు. ఇందులో ఐదు వేల మందికి ఉపాధి లభిస్తుంది. అదే గుర్రంపాలెంలో 16.47 ఎకరాల్లో అవంతి గ్రూపు వేర్‌హౌసింగ్ నిర్మిస్తుంది. దీని అంచనా వ్యయం రూ.114.37 కోట్లు. 1,200 మందికి ఉపాధి లభిస్తుంది.

నేడు డాక్‌యార్డ్ వంతెన ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

నిర్మాణంలో ఉపయోగించిన ఇనుము తుప్పుపట్టకుండా విదేశాల నుంచి తీసుకువచ్చిన పెయింట్లను వేశారు. ఎలక్ట్రో మాగ్నిటిక్ బేరింగులను కూడా ఏర్పాటుచేశారు. పాదచారులు నడిచి వెళ్లేందుకు ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌ను నిర్మించారు. దీనికిందనే విద్యుత్ కేబుల్స్‌ను రన్ చేయడానికి ట్రాక్‌లను నిర్మించారు. కాగా రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వంతెనపై 15 విద్యుత్ దీపాలను అమర్చారు.

ప్రయాణం ఇలా.. పారిశ్రామిక ప్రాంతవాసులు నేరుగా వంతెన పైనుంచి ఎస్ఆర్ కంపెనీ మీదుగా కాన్వెంట్ వంతెనకు చేరుకుని, అక్కడి నుంచి నగరంలోకి వెళ్లవచ్చు, తిరిగి వచ్చేటప్పుడు జ్ఞానాపురం దాటిన తరువాత రామ్మూర్తిపంతులు పేట మీదుగా డాక్‌యార్డు క్వార్టర్స్ మార్గంలో వంతెనపైకి వచ్చి, అక్కడి నుంచి పారిశ్రామిక ప్రాంతానికి చేరుకోవచ్చు. వంతెన అందుబాటులోకి రానుండడంతో ప్రయాణాలకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరం తగ్గనుంది.

కైలాసగిరికి కొత్త రోప్‌వే

... 5వ పేజీ తరువాయి

తెన్నేటి పార్కు నుంచి కొండపైకి రోప్‌వే ద్వారా తీసుకువెళ్లి, అక్కడి నుంచి మళ్లీ తెలుగు మ్యూజియం వరకూ మరో రోప్‌వే వేయాలని డిజైన్ చేశారు. ఇలా మొత్తం రోప్‌వే పొడవు 1.5 కి.మీ వస్తుందని అంచనా వేశారు. ఆ తరువాత కొండ పైనుంచి భూమ్యాకర్షణ శక్తితో కిందికి వచ్చేలా లూజ్ గ్రావిటీ రైడ్లు కూడా పెట్టాలని గత ఆగస్టులో టెండర్లను ఆహ్వానించారు. ఈసారి పీపీపీ విధానంలో పెట్టారు. దీనికి రూ.60 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అయితే అధికారులు ఆశించినట్టుగా టెండర్లు రాలేదు. కేవలం ఒక్కటెండర్ వచ్చింది. మరి కొందరు గడువు పెంచాలని, వ్యయం ఎక్కువ అవుతుందని, ఆదాయం పెద్దగా రాదంటూ సూచనలు చేశారు.

మళ్లీ టెండర్లు పిలుస్తాం

తెన్నేటి పార్కు నుంచి రోప్‌వే పెట్టాలని అనుకున్నాం. అయితే ఇందులో భాగంగా చేసిన లూజ్ గ్రావిటీ రైడ్ లాభదాయకం కాదనే అభిప్రాయం వ్యక్తమైంది. దానిని తొలగించి, కేవలం రోప్‌వే ఒక్కటే తెలుగు మ్యూజియం వరకూ వేయాలని అనుకుంటున్నారు. వ్యయం కూడా రూ.60 కోట్లు కావడంతో ఎవరూ ముందుకు రావడం లేదు. దానిని కూడా తగ్గించి మళ్లీ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించాము.

ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

సీతమ్మధార సబ్‌ట్రెజరీ విభజనకు మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

సాగిస్తున్నట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే ఎరియర్స్ డ్రా చేయని పింఛన్‌దారుల వివరాలు సేకరించి వారి కుటుంబ సభ్యులను సంప్రతిస్తుంటారని, అధ్యాపకులు/ఆచార్యులకు సంబంధించి వేతన సవరణ బకాయిలు మంజూరుచేసేందుకు భారీగా ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీతమ్మధారలో ఐదేళ్లుగా పనిచేస్తున్న ఒక సీనియర్ ఉద్యోగిని బదిలీ చేయకపోవడానికి సొమ్ములు చేతులు మారడమే కారణమంటారు.

ప్రస్తుతం సీతమ్మధార డివిజనల్ సబ్‌ట్రెజరీలో సహాయ ఖజానాధికారి, ఇద్దరు ఉప ఖజానాధికారులు, ఆరుగురు సీనియర్, ఇద్దరు జూనియర్ అకౌంటెంట్లు, షరాఫ్ (రికార్డు అసిస్టెంట్), మరికొందరు అటెండర్లు ఉన్నారు. ప్రతినెలా 20 వేల మందికి పింఛన్లు బట్వాడా చేయాల్సి ఉండడంతో ఒత్తిడి ఎక్కువగానే ఉంటుంది. కనీసం పది మంది సీనియర్, ఆరుగురు జూనియర్ అకౌంటెంట్లు ఉండాలి. సిబ్బంది కొరత వల్ల తప్పులు జరుగుతున్నాయని ఉన్నతాధికారులు చెబుతున్నా అదనపు సిబ్బందిని నియమించడం లేదు. ఏదేమైనా సీతమ్మధార సబ్‌ట్రెజరీపై ప్రభుత్వం దృష్టిసారించాలని పింఛన్‌దారులు కోరుతున్నారు.

ఇటు పారిశ్రామికాభివృద్ధి, అటు యువతకు ఉపాధి

... 5వ పేజీ తరువాయి

ఈ పార్కులు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరగనున్నాయన్నారు. గత ప్రభుత్వంపై నమ్మకం లేక పారిశ్రామికవేత్తలు ఎవరూ పెట్టుబడులు పెట్టలేదని, దాంతో యువతకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయన్నారు. చంద్రబాబునాయుడు నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుతీరిన తరువాత పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు వల్ల స్వస్థలాల్లోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని, అందుకే ఇక్కడ పరిశ్రమలు పెట్టేందుకు అంతర్జాతీయస్థాయి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పెదగంట్యాడ తహశీల్దార్ అమల, పలువురు పారిశ్రామికవేత్తలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా కనిగిరిలో నిర్వహించిన పరిశ్రమల ప్రోత్సాహక సమావేశాన్ని వర్చువల్‌గా తిలకించారు.

ఆహార పొట్లాల పంపిణీ

అగనంపూడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి సత్రం జంక్షన్‌లో మంగళవారం భ్రమరాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో అనాథలు, యాచకులు, వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. సంస్థ సేవా కార్యక్రమంలో భాగంగా దాతల సాయంతో ప్రతి వారం అన్నదానం నిర్వహిస్తున్నామని సేవా సమితీ ఆర్గనైజర్ చిత్తా రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంఓల సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వాయుపుత్రునికి పూజలు

అగనంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సిగ్నల్ జంక్షన్ వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు స్వామివారిని నూనత వస్త్రాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ స్వామివారికి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం ఆలయంలో భక్తులు లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాగబంధన్ విగ్రహ ప్రతిష్ఠ

కూర్మన్నపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు లక్ష్మీపురంలో ఉన్న త్రిశక్తి ఆలయంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నాగబంధన్ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, హోమాలు, మండపారాధనలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు అవిరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ త్రిశక్తి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు నాగ బంధన్ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కిరెడ్డిపాలెం. నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం, కేర్ ఆసుపత్రి, మహాత్మగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా తుంగ్లాం కాలనీలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం తుంగ్లాం కాలనీలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్ కుమార్, ఎం సత్యప్రకాశ్, డాక్టర్ కిశోర్, ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలను అడ్డుకోవాలి: జియ్యాని శ్రీధర్

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి సర్కారు చేపడుతున్న అరాచకాలు అడ్డుకోవాలని వైసీపీ కార్యకర్తలకు మాజీ డిప్యూటి మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. 52వ వార్డు వైసీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ విజయవంతం చేయాలని కోరారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 26, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 50, ఆనపకాయ 38,కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 60, దొండకాయలు 54, బంగాళ దుంపలు 18,అరటికాయ(పె)7, మునక్కాడలు (కిలో) 70,అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు(కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరుచిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండ ఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట)4,మామిడికాయలు60, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

శిథిలమైన డ్రైనేజీ వ్యవస్థ

- సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో ఈ పరిస్థితి
- అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్న స్థానికులు



పూర్తిగా శిథిలమైన డ్రైనేజీ

పెదగంట్యాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వవార్డు పెదగంట్యాడ కాలనీలో ప్రధాన డ్రైనేజీ పూర్తిగా శిథిలమయ్యింది. గాజువాక మున్సిపాలిటీ ఆవిర్భావదశలో నిర్మించిన ఈ డ్రైనేజీకి సకాలంలో మరమ్మతులు చేయపట్టకపోవడంతో ఇలా తయారయ్యింది. పెదగంట్యాడ న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి బీసీ రోడ్డు మహాత్మా గాంధీ సెంటర్ వరకు ఉన్న ప్రధాన డ్రైనేజీ, మహాత్మా గాంధీ సెంటర్ నుంచి గంగవరం మెయిన్ రోడ్డు ప్రక్కనుంచి విశాఖ విమల విద్యాలయం వరకు ఉన్న మరోక డ్రైనేజీ ఇవి రెండు పూర్తిగా పాడయ్యాయి. డ్రైనేజీలకు ఇరువైపులా వేసిన గట్లు కూలిపోయి మట్టిలో కలిసిపోయాయి. ఇప్పుడా డ్రైనేజీలకు గట్లు లేక మట్టి అంచులతోనే మిగిలాయి. పెదగంట్యాడ, గొడ్డువానిపాలెం, సత్యనారాయణపురం కాలనీల నుంచి వచ్చిన మురుగు, వర్షం నీరు ఈ డ్రైనేజీల్లోనే కలుస్తాయి. చిన్నపాటి వర్షానికి ఈ డ్రైన్లు, రోడ్లు ఏకమైపోతాయి. ఈ డ్రైనేజీల్లో నిత్యం మురుగు ఉంటోంది. వారాల తరబడి మురుగు నిల్వ ఉండడంతో దాని నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల కూడా ఎక్కువగా ప్రబలతున్నాయి. స్థానికులకు ఈ దుర్గంధం, దోమల బెడద తప్పడం లేదు. ఈ డ్రైనేజీలకు మరమ్మతులు చేయించి, వీటిపైన పలకలు వేయిస్తే తప్ప దుర్వాసన, దోమల సమస్య పరిష్కారం అయ్యేటట్టు లేదని స్థానికులు అంటున్నారు. తమ సమస్యను ఎన్నో సార్లు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లామని స్థానిక మహిళలు తెలిపారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు, పలువురు వాహనదారులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు



దువ్వాడ రైల్వే స్టేషన్ దగ్గర ఆర్పీఎఫ్ సిబ్బంది

కూర్మన్నపాలెం,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటన తరువాత దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సిబ్బంది భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు రైళ్ల వచ్చే సమయంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. కొత్త వ్యక్తులు కనబడితే వారి గురించి ఆరా తీసి వివరాలు సేకరించారు. ప్రతి రైలును క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. దేశభద్రతకు విఘాతం కలిగేలా ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సింహాచలం స్టేషన్‌లో..



సింహాచలం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గోపాలపట్నం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఆగిన రైళ్లలోకి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెయిటింగ్ హాల్, టికెట్ బుకింగ్ కేంద్రాల వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులక భద్రతా పై అవగాహన కల్పించారు.

స్టీల్‌ప్లాంటులో పటిష్ఠ భద్రత

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో కేంద్ర నిఘా వర్గాల ఆదేశాల మేరకు స్టీల్‌ప్లాంట్‌లో భద్రతను మరింత పటిష్ఠం చేశారు. స్టీల్ ప్లాంట్ తీర ప్రాంతలో ఉండడంతో నిఘా ఎక్కువ చేశారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ ప్రధాన గేటు, విస్తరణ గేటు, బీసీ గేటు, ప్లాంట్ లోపల పలు కీలక విభాగాల వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ప్లాంట్‌లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతిస్తున్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సీఐఎస్ఎఫ్ అధికారులకు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన

కూర్మన్నపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, తద్వారా మూగజీవులకు, సకల ప్రాణులకు క్యాన్సర్‌తో పాటు పలు ప్రాణాంతక వ్యాధులు సోకే అవకాశం ఉన్నదని 87వ వార్డు తిరుమల కాలనీ వాసులు అన్నారు. రైతుబజార్‌లో మంగళవారం ప్లాస్టిక్ నివారించాలి అంటూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు జి. విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కూరగాయలకు నార సంచులు, మాంసం, చేపలు తీసుకెళ్లేందుకు స్టీల్ బాక్సులు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గోల్డెన్‌స్టార్స్ అవార్డులు



అవార్డులు తీసుకున్న విద్యార్థులతో చాంద్ పాషా

పెదగంట్యాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 'బిగ్‌హెల్ప్‌ఫర్ ఎడ్యుకేషన్ చైర్మన్ సంస్థ' గోల్డెన్‌స్టార్స్ అవార్డులు అందజేసింది. ప్రతి తరగతి నుంచి పదిమందిని ఎంపిక చేసి వారికి ఈ అవార్డులను సంస్థ చైర్మన్ చాంద్ పాషా చేతుల మీదుగా అందజేశారు. వీటితో పాటు విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నడుపూరు హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చాంద్‌పాషా మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని విద్యార్థులు, పేదరికంలో ఉన్న విద్యార్థుల చదువు ఆగిపోకూడదన్న లక్ష్యంతో అలాంటి పిల్లలను తమ సంస్థ దత్తత తీసుకుని వారి చదుకు కోసం అవసరమైన సహాయాన్ని సంస్థ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏయూలో విద్యార్థుల కొట్లాట

- కార్లతో వచ్చి హల్‌చల్ చేసిన బయటి విద్యార్థులు.. కేసు నమోదు



శ్రీకృష్ణదేవరాయ హాస్టల్ ఆవరణలో గొడవ పడుతున్న విద్యార్థులు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్సిటీలోని శ్రీకృష్ణ దేవరాయల వసతి గృహంలో హాస్టల్‌కు చెందిన విద్యార్థులు, బయటి విద్యార్థులకు మధ్య గొడవ జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ గొడవకు సంబంధించి విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. వర్సిటీలో ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థి వినోద్ కొద్ది రోజులుగా ఇదే హాస్టల్‌లోని ఒక రూమ్‌లో ఉంటున్నాడు. సాధారణంగా కోర్సు పూర్తయిన తరువాత విద్యార్థులు వసతి గృహం ఖాళీ చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్న వెంకటరమణ, సతీష్ ల రూమ్‌లో ఉంటున్నాడు. అయితే, వినోద్ ఎప్పటికప్పుడు బయట వ్యక్తులను హాస్టల్‌లోకి తీసుకురావడం పట్ల ఇబ్బంది పడుతున్న వెంకటరమణ, సతీష్‌లు రూమ్‌కు రావద్దని సూచించారు. దీనిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తంచేసిన వినోద్ శనివారం రాత్రి కొంత మంది స్నేహితులను వెంటబెట్టుకుని కార్లలో హాస్టల్‌కు వచ్చి వీరంగం సృష్టించారు. ఈ క్రమంలోనే హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు, బయటి నుంచి కార్లతో వచ్చిన వారికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకానొకదశలో కొట్లాటకు దిగినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించిన కొందరు... అధికారులకు సమాచారాన్ని ఇచ్చారు. అధికారులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. దీనిపై వర్సిటీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు ఇరువర్గాలపై కేసునమోదు చేశారు

స్టీల్‌సిటీ డిపో నిలుపుదలకు ఈయూ కృషి

కూర్మన్నపాలెం,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో తరలింపు ఆపేందుకు ఈయూ కృషి ఫలించబోతుందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి. దామోదరరావు అన్నారు. స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో ఈయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో 33 సంవత్సరాలు స్టీల్‌సిటీ డిపో లీజు ముగియడంతో రూ.133 కోట్లు చెల్లించాలని లేని పక్షంలో డిపోను ఖాళీ చేయాలని ఆర్టీసీ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం నోటీసులు జారీ చేసిందన్నారు. ఈలీజును 33 ఏళ్లకు పొడిగించాలని ఆర్టీసీ ఎండీ, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ విజయనగరం జోన్, ఏపీపీటీడీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ కృషి చేసిందని పేర్కొన్నారు. స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో తరలింపు నిలుపుదల, డిపో లీజు గడువు పొడిగింపు పై త్వరలో ఆదేశాల రాబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, విజయనగరం జోనల్ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరహార దీక్షలు

కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో తరలింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరహార దీక్ష 75వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్ఎంయూ డిపో ఆర్గనైజింగ్ కార్యదర్శి కేఎస్‌రావు మాట్లాడారు. స్టీల్‌సిటీ డిపో తరలింపు నిలపాలన్నారు.

ఆ రహదారిలో నిత్యం ఇబ్బందులే!



ఉడా కాలనీలో తవ్వి వదిలేసిన రోడ్డు

గాజువాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మించిన రోడ్డును రెండేళ్ల కాలంలో నాలుగు సార్లు తవ్వి విడిచిపెట్టడంతో నిధుల దుర్వినియోగంతో పాటు ప్రయాణం చేసే సమయంలో ఇబ్బందులు ఎదురవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గాజువాక ఉడాకాలనీ రోడ్డు నిర్మాణం జరిగిన కొంతకాలానికి యూజీడీ పనులు, గ్యాస్‌పైప్‌లైన్, నీటి పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వారు. తాజాగా భూగర్భ విద్యుత్ లైన్ కోసం రోడ్డును తవ్వుతున్నారు. అధికారులు ముందు చూపు లేకపోవడం వల్ల రోడ్డు వేసిన ఫలితంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నూతనంగా వేసిన రోడ్డును మళ్లీమళ్లీ తవ్వడంతో నిధులను దుర్వినియోగం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రోడ్డును తవ్వి విడిచివదిలేదయడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధుడిపై దాడి చేసిన నిందితుల అరెస్టు

గాజువాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన నలుగురిని గాజువాక క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాతయ్యపాలెంలో నివాసముంటున్న దొడ్డి వెంకటరావు అనే వృద్ధుడు రాత్రి ఏడు గంటల సమయంలో ఇంట్లో మద్యం సేవిస్తుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి మద్యం సీసాను పగలగొట్టి బెదిరించి మూడు మద్యం సీసాలు తీసుకెళ్లిపోయారు. కొంత సమయానికి మరో ఇద్దరు వచ్చి వెంకటరావును బెదిరించి జేబులో ఉన్న రూ.280 తీసుకుని, అతనిపై కత్తులతో దాడి చేశారు. గాయపడిన వెంకటరావు ఫోన్ ద్వారా తన కుమారులకు సమాచారం ఇవ్వగా 108 సహాయంతో కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వెంకటరావు చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసిన గాజువాక పోలీసులు నాతయ్యపాలెంకు చెందిన చక్రాల రాజు, కోన మల్లేశ్వరరావు, ధనల సురేశ్, జంపన జగన్నాథ దాడికి పాల్పడినట్టు గుర్తించి అరెస్టు చేశామని సౌత్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

నూకాలమ్మ ఆలయంలో స్వాములకు అన్నసమారాధన

వేపగుంట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలో కొలవైన నూకాలమ్మ ఆలయంలో అయ్యప్పస్వాములకు మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. అక్టోబరు 20 నుంచి అన్నసమారాధన చేపడుతున్నారు. మంగళవారం నిర్వహించిన అన్నసమారాధనకు విరాట్‌నగర్‌కు చెందిన లామా కేటరింగ్ ఆర్థిక సాయం చేశారు. ఈ అన్నసమారాధనలో దాదాపు 300 మంది స్వాములకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈనెల 20 వరకు జరుగుతుందని తెలిపారు.

ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గత వారం నగరంలో జరిగిన అండర్ - 17 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థి డి.గిరీష ఎంపికైనట్టు పీఈటీ మొహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. ఈ సందర్భంగా తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గిరీష రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఎంతో సంతోషంగా ఉన్నదని హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కమిటీ గిరీషను అభినందించారు.

రూ.9 వేల పింఛను ఇవ్వాలని నిరసన

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రూ. 9 వేలు ఇచ్చేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు మర్రిపాలెం పీఎఫ్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రీజనల్ కార్యదర్శి ఎ.వెంకటరావు మాట్లాడుతూ 2024లో డీడీ ద్వారా చెల్లించిన వారిని విస్మరించి, వారికి 2025 పెన్షన్ ఇవ్వడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో ఉన్న జోనల్ పీఎఫ్ ఆఫీసును తక్షణమే రాష్ట్రానికి తీసుకురావాలని, తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.



వంతెనపై పర్యటిస్తున్న పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు

సర్దార్ పటేల్ వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే

మల్కాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డాక్‌యార్డు సమీపంలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన బుధవారం ప్రారంభమవుతున్న సందర్భంగా మంగళవారం రాత్రి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సమ్మిట్‌కు ముందే ఈ వంతెనను ప్రారంభిస్తున్నామని అన్నారు. పారిశ్రామిక, గాజువాక ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు నగరానికి వెళ్లడానికి ఈ వంతెనను ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో పోర్టు చీఫ్ ఇంజనీరు, పోలీసులు, టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు

ప్లాట్డ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

గోపాలపట్నం: స్థానిక పద్మనాభనగర్‌లో నిర్మించనున్న ప్లాట్డ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులకు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో సీఐఐ భాగస్వామ్య సమ్మిట్-25 కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఈ ప్లాట్డ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో 23 ఎంటర్‌ప్రైజెస్ వర్క్‌షాపులను ఏర్పాటు జరుగుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం, డిఈ కిశోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వ సహకారం

- ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



సమావేశంలో పాల్గొన్న ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలోని నాయీబ్రాహ్మణుల సేవా సంఘం నూతన కమిటీకి కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. 52వ వార్డులోని వేమన సంక్షేమ భవనంలో విశాఖ నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ వైసీపీ పాలనలో వెనుబడి వర్గాలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వారి చేయూతకు సహాయ సహకరాలు అందిస్తోందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ వచ్చాక వెనుబడిన వర్గాల అభివృద్ధికి నాంద పలికారని అన్నారు. బీజేపీ నగర్ అధ్యక్షుడు పరుశరామ్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని అన్నారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ సెలూన్ పెట్టుకునేందుకు ఆర్థిక సహాయంతో పాటు ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా 200 యూనిట్లు ఉచితంగా అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు.

'నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి కల్పించాలి'

పెదగంట్యాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉక్కునిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్టీల్ ఇంటక్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్‌ను కోరారు. పెదగంట్యాడ పారిశ్రామిక వాడలో మంగళవారం జరిగిన ఇండస్ట్రియల్ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న అనేక మంది నిర్వాసితులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగించిందని, వారిని వెంటనే విధుల్లోనికి తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల తొలగింపు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును యాజమాన్యం ఆపడంలేదు. ఒకేసారి కాకుండా రోజుకు పది మంది చొప్పున తొలగిస్తోందని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు. ఒకేసారి తొలగిస్తే ఇబ్బందులు వస్తాయని యాజమాన్యం ఇలా చేస్తోందని వారు ఆరోపిస్తున్నారు. కార్మికులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగిస్తోందని, లేబర్ గేటు వద్ద బయోమెట్రిక్ పడకపోతే తొలగించినట్టు అర్థం చేసుకోవాలని తెలపారు. ఈ మధ్య కాలంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికుల్లో నిర్వాసిత కార్మికులు లేరని సమాచారం.

'వీవీవీ' ఉపాధ్యాయుల ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న విశాఖ విమల విద్యాలయంలో ఉపాధ్యాయులు, సిబ్బందికి న్యాయం చేయాలని ప్లాంట్‌లోని తెలుగుతల్లి జంక్షన్ వద్ద ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులు వేరే పాఠశాలలో చేరిపోయారని, ఉపాధ్యాయులు, సిబ్బంది అన్యాయం అయిపోయారని పేర్కొన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. మూడు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి'

అగనంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందని 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర పేర్కొన్నారు. జాతీయ హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫార్మాసిటీ పునరావాస కాలనీ వరకూ ఉన్న రోడ్డు విస్తరణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కొలువులు

గోపాలపట్నం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల(అటానమస్)లో భువనేశ్వర్‌లోని ఎలక్ట్రికల్ కోర్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన ఎస్.ఆనంద్‌బాబు, టి.పయాని కొలువులు సాధించారు. ఈ మేరకు కొలువులు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్‌లు డాక్టర్ జీవీ ప్రదీప్ వర్మ, డీన్ సీడీసీ.వర్మ, అధ్యాపకులు అభినందించారు.

చురుగ్గా భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు

కూర్మన్నపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్ల పనులు చురుగ్గా జరుతున్నాయి. ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఆటోనగర్, వడ్లపూడి, కణితి ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రోడ్డును తవ్వి కేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ ఈ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్ల ఏర్పాటు పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో భూగర్భం నుంచే విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించడం ఆనందం: బొండా జగన్

జీవీఎంసీ 87 వార్డు సిద్ధార్థ నగర్‌లో రూ.1.56 కోట్లతో నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు జీవీఎంసీ అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ పనులను రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గతంలో ఆర్యవైశ్య సామాజిక భవనంలో నిర్వహించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చా వేదిక 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రస్తావన అధికారుల ముందుకు వచ్చిందని తెలిపారు. అందులో భాగంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సే మీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది. 'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో



కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్న గారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు మందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా 'రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆద్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

టీటీడీ ఆధ్వర్యంలో మరిన్ని భక్తి కార్యక్రమాలు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), హిందూ ధర్మ ప్రచార పరిషత్ సారథ్యంలో మరిన్ని భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆర్‌కే బీచ్‌లో సోమవారం నిర్వహించిన కార్తీక దీపోత్సవానికి జిల్లా అధికారులు, పోలీసులు చక్కటి సహకారం అందించారన్నారు. సుమారు ఐదు వేల మందికి భక్తులకు ఉచితంగా టికెట్లు పంపిణీ చేశామని, 300 మంది శ్రీవారి సేవకులు పాల్గొన్నారన్నారు.

20న కాకినాడ, రాజమండ్రిరైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తుని, రావికంపాడు సెక్షన్‌ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 20న కాకినాడ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17267), విశాఖ-కాకినాడ ఎక్స్‌ప్రెస్ (17268), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286) రైళ్లను రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

కాలినడకన సింహగిరికి

» అప్పన్న మొక్కు తీర్చుకున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



ఎద్దులతో కాలినడకన సింహగిరికి వెళ్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింహాచలం/ గోపాలపట్నం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుటుంబం ఆచారం మేరకు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు(గణబాబు) మంగళవారం కాలినడకన సింహగిరికి చేరుకుని మొక్కలు తీర్చుకున్నారు. గోపాలపట్నంలోని తన నివాసం నుంచి కుటుంబసభ్యులు, పార్టీ శ్రేణులు, నాలుగు తోడెపెద్దులతో కలిసి కాలినడకన సింహాచలం చేరుకున్నారు. సింహాద్రినాథుని సోదరి పైడితల్లమ్మ ఆలయం వద్ద టీడీపీ నేతలు స్వాగతం పలికారు. అక్కడ పూజలు చేసి తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టి ఘాట్‌రోడ్డులో కాలినడకన సింహగిరికి చేరుకున్నారు. వెంట తెచ్చిన తోడెపెద్దులను ఆలయ ధ్వజస్తంభం వరకు తీసుకువెళ్లారు. అధికారులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం అనంతరం అర్చకులు పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అటవీశాఖకు రాడిసన్ బ్లూ రిసార్ట్ విరాళం

» రూ.2,59,15,269 చెక్కు అందించిన యాజమాన్యం



చెక్కు అందుకుంటున్న జూ క్యూరేటర్ మంగమ్మ

సాగర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాడిసన్ బ్లూ రిసార్ట్ (మాగ్ లీజర్స్) అటవీశాఖకు భారీ విరాళాన్ని అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంస్థ కార్యాచరణ ఆదాయం నుంచి రూ.2,59,15,269 చెక్కును సీఏఎంపీఏ (కాంపా) నిధికి మంగళవారం డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జి.మంగమ్మకు మాగ్ లీజర్స్ మేనేజింగ్ పార్టనర్ కె.ఉమేష్, రాడిసన్‌బ్లూ రిసార్ట్ విశాఖపట్నం ప్రతినిధులు జి.శ్రీలత, అభిషేక్ పాణి అందజేశారు. ఈ నిధులను పర్యావరణ పరిరక్షణ, హరిత అభివృద్ధికోసం వెచ్చించనున్నారు.

అప్పన్నను దర్శించుకున్న రష్యన్లు



క్యూ లైన్‌లో రష్యన్లు

సింహాచలం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహ స్వామిని సాధారణ భక్తులతోపాటు రష్యాకు చెందిన పర్యాటకులు మంగళవారం దర్శించుకున్నారు. హైందవ సంప్రదాయాన్ని అనుసరిస్తూ నుదుటన తిలకధారణ చేసి దైవనామ స్మరణతో అంతరాలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకుని, ఉచిత ప్రసాదాన్ని స్వీకరించారు. రష్యన్లతో పలువురు సెల్ఫీలు తీసుకున్నారు.

17 నుంచి కుష్ఠు వ్యాధి గుర్తింపు కార్యక్రమం

» జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌లో, తదితరులు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి 30 వరకు జిల్లాలో వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని చేపడతామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పట్టణ ప్రాథమిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు మంగళవారం కుష్ఠు వ్యాధి నిర్ధారణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బాధితులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుందామన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ ఆర్ రమేశ్ మాట్లాడుతూ సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 920 బృందాలు వ్యాధి గుర్తింపు కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. శిక్షణలో డీపీఎంవో ఎన్‌హెచ్ఎం డాక్టర్ బి.ఉమావతి, డీఎస్ఎం డాక్టర్ పద్మజ, డీపీఎంలు ప్రసాదరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల భద్రతకు పటిష్ఠ చర్యలు

» ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతయ్య



సమావేశంలో పాల్గొన్న అధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతయ్య

సింహాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ దేవాలయాలపై ఉగ్రమూకల అనూహ్య దాడుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా మెలగాలని ఆక్టోపస్ డీఎస్పీ ఐ.తిరుపతయ్య సూచించారు. దేశరాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు సంఘటన నేపథ్యంలో సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయ పరిధిలో మంగళవారం పలు శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలు, పలు శాఖల మధ్య సమన్వయంపై చర్చించారు. దేవస్థానం ఈఓ ఎన్.సుజాత మాట్లాడుతూ పోలీసుశాఖ సూచన మేరకు ఆలయ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్టు చెప్పారు. ఆలయ సిబ్బంది అనుసరించాల్సిన విధానాలపై మంగళవారం రాత్రి మాక్‌డ్రిల్ నిర్వహించామని ఆక్టోపస్ డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఆక్టోపస్ ఇన్‌స్పెక్టర్ శివాజీ, దేవస్థానం ఏఈఓలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి, గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

తగరపువలస, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం దూసి గ్రామానికి చెందిన చందక శ్రీనివాసరావు (33)కు 2024 సెప్టెంబరు 29న అదే ప్రాంతానికి చెందిన లావణ్యతో వివాహం జరిగింది. ఆరునెలల తరువాత దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా ఆమె ఈ ఏడాది మార్చిలో పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శ్రీనివాసరావు అన్నదమ్ములతో కలిసి ఉంటున్నాడు. ఫార్మా కంపెనీలో ఉద్యోగం చూసుకుంటానని సోమవారం ఇంటి నుంచి బయలుదేరి చిట్టివలస జూట్‌మిల్లు రామాలయం వద్దకు వచ్చి గడ్డిమందు (పురుగులమందు) తాగాడు. విషయాన్ని అతని బావ నారాయణరావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. అతను భార్య స్వాతికి చెప్పడంతో స్వాతి, మృతుడి తమ్ముడు జగదీష్ చిట్టివలస వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక మరొకరు...



ఈశ్వరరావు(ఫైల్)

భీమునిపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చిన ఉప్పాడ ఎస్సీ కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మైలపల్లి ఈశ్వరరావు (46) అప్పుల బాధలు భరించలేక, మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడని మృతుని భార్య స్రవంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం పనికి వెళ్లకుండా ఇంట్లోనే పడుకున్నాడని, సాయంత్రం వరకూ గది తలుపులు తెరవకపోవడంతో అనుమానంతో బద్దలుకొట్టి దుప్పటితో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, హెచ్‌సీ త్రినాథ్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారని సీఐ తిరుమలరావు తెలిపారు.

బైక్ పైనుంచి జారిపడి యువకుడి మృతి



సోమేశ్వరరావు (ఫైల్ ఫొటో)

ఆనందపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బైక్ పైనుంచి జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మామిడిలోవ వద్ద మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బొడ్డపాలేనికి చెందిన ఎరుసు సోమేశ్వరరావు (40) తన బావమరిది ప్రసాద్‌తో కలిసి గోపాలపట్నం బయలుదేరాడు. ప్రసాద్ వాహనాన్ని అతివేగంతో నడుపుతూ స్పీడ్ బ్రేకరును చూడలేదు. దీంతో ఒక్కసారిగా వెనుక కూర్చున్న సోమేశ్వరరావు జారి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించి, మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆసక్తికరంగా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎంవీపికాలనీ, ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో 40వ అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ ఆసక్తికరంగా సాగుతోంది. పురుషుల విభాగంలో తమిళనాడు, తెలంగాణ...మహిళల విభాగంలో వెస్ట్ బెంగాల్, గుజరాత్ సెమీస్‌కు చేరాయి. మహిళల సెమీఫైనల్స్‌లో ఆంధ్రపై వెస్ట్ బెంగాల్, తమిళనాడుపై గుజరాత్ గెలుపొందాయి. పురుషుల టీం ఈవెంట్‌లో తొలి సెమీఫైనల్స్‌లో తమిళనాడు వెస్ట్ బెంగాల్‌పై, రెండో సెమీ ఫైనల్స్‌లో తెలంగాణ అసోంపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరాయి.